
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 09.01.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


www.lawyerteluguweekly.com


## రైతు రక్షణలో
# విపక్షాలు విఫలం

**2002లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు భారీగా విద్యుత్ ఛార్జీలు పెంచాడు. విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యమాలు జరిగాయి. ఆరోజు తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ, సిపిఎం, సిపిఐ వంటి విపక్షాలన్నీ ఒక్కతాటిపై నిలిచి పోరాడాయి. తమ పోరాటాలతో ప్రభుత్వానికి చెమటలు పట్టించాయి. చివరకు బషీర్‌బాగ్ కాల్పుల ఉదంతం చోటుచేసుకోవడం తెలిసిందే! ప్రతిపక్షాలన్నీ ఏకమైతే ఉద్యమం ఎంత ఉధృతరూపం దాలుస్తుందనేదానికి ఆనాటి కరెంట్ ఉద్యమమే ఉదాహరణ.**

ఇప్పుడు విపక్షాలలో అలాంటి ఉద్యమ స్ఫూర్తి లోపించింది. ఎవరి పంథాలో వాళ్లు రాజకీయ ఉపన్యాసాలు తప్ప ఇంకేమీ చేయకపోతుండడంతో విపక్షాల మధ్య ఉన్న అనైక్యతే ప్రభుత్వానికి బలంగా మారింది. ప్రభుత్వం ఎంతటి ప్రజావ్యతిరేక నిర్ణయాలనైనా అవలీలగా తీసుకుంటూపోతుంది. ప్రభుత్వ వైఫల్యాలు, నియంతృత్వ పోకడలపై పోరాడడంలో రాష్ట్రంలోని విపక్షాలన్నీ కూడా విఫలమయ్యాయి. రాజధాని భూముల వ్యవహారం రగులుకొని వుంది. రాష్ట్ర ప్రభుత్వం సిఆర్‌డిఏ చట్టం ద్వారా రైతుల నుండి భూములను లాక్కునే పనికి శ్రీకారం చుట్టింది. రాజధానికి భూములిస్తామన్న రైతులున్నారు. మేం ఇవ్వమంటున్న రైతులున్నారు. ఇవ్వడానికి ఇష్టపడని వారి నుండి కూడా భూములు లాగేసేందుకే సిఆర్‌డిఏ చట్టం తెచ్చారు. రాజధాని భూములపై విపక్షాలన్నీ కలిసొస్తే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం నడపొచ్చు. పచ్చటి పొలాలు కాంక్రీట్ అరణ్యాలు కాకుండా అడ్డుకోవచ్చు. కాని ఈ విషయంలో ఏ ప్రతిపక్ష పార్టీ కూడా చిత్తశుద్ధితో పోరాడడంలేదు. రైతులు, పొలాలు,

(మిగతా 10వ పేజీలో)












శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
**సంక్రాంతి శుభాకాంక్షలు.**
సం/-



## దురాక్రమణలపై...
# తొలి దెబ్బ పడింది

**అక్రమ లేఅవుట్లు, అప్రూవల్ లేని భవనాలు, నిబంధనలను అతిక్రమించి కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆక్రమించి కట్టేసిన కల్యాణ మండపాలు... ఇదీ నెల్లూరు నగర పరిస్థితి.**

వంద అంకణాల సొంత స్థలం ఉంటే మరో 20 అంకణాల మున్సిపల్ స్థలాన్నో లేక ఇరిగేషన్ స్థలాన్నో ఆక్రమించి బిల్డింగ్‌లు కట్టుకోవాలనే ఆలోచన తప్ప, వంద అంకణాలలో ముందురోడ్డుకు పది అడుగుల స్థలాన్ని వదిలేసి కొంచెం లోపలకు భవనాలను కట్టుకోవాలనే ఆలోచన దాదాపు చాలా తక్కువ మందిలో కనిపిస్తుంది. నెల్లూరులో అప్రూవల్ ప్లాన్‌కు అనుగుణంగా ఉండే భవనాలు చాలాతక్కువ. నిబంధనలు ఉల్లంఘించి కట్టిన భవనాలు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లే నగరం నిండా కనిపిస్తాయి. ఇంతకాలం కూడా రాజకీయ పలుకుబడి, నాయకుల అండదండలుండబట్టి అక్రమ నిర్మాణాలు జరుగుతూ వచ్చాయి.

ఇప్పుడు పరిపాలన మారింది. రాజకీయ నాయకుల కంటే అధికారుల హవా పెరిగింది. ముఖ్యంగా నెల్లూరు నగర కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి చక్రధర్‌బాబు

(మిగతా 10వ పేజీలో)

### పనిచేయని పనబాక పలుకుబడి



## పోస్టింగ్ లేని రేఖారాణి
# జేసీగా ఇంతియాజ్






**నెల్లూరుజిల్లా జాయింట్‌కలెక్టర్‌గా ఇంతియాజ్ అహ్మద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా ఉన్న జి.రేఖారాణిని ముఖ్యకార్యదర్శికి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.**

రేఖారాణి జిల్లాకు జేసీగా వచ్చి పదినెలలే

(మిగతా 10వ పేజీలో)

## అయ్యో పాపం...
# ఎంత ఘోరం



**కొత్త ఏడాది ప్రారంభమై సరిగ్గా ఏడు రోజులు కూడా పూర్తిగా గడవక ముందే, బుధవారం అనంతపురం జిల్లా పెనుకొండ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది దుర్మరణం పాలుకావడం ప్రజలందరినీ కలచివేస్తోంది.**

(మిగతా 10వ పేజీలో)



# పక్షుల పండుగకు నూతన శోభ

నెల్లూరుజిల్లా దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నూతన శోభను సంతరించుకుంది. ఈ నెల 9వ తేదీ నుంచి మూడురోజుల పాటు జరిగే పండుగకు దూరప్రాంతాల నుంచి వేలాదిమంది సందర్శకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడికి చేరుకుని వలస విహంగాలను వీక్షించనున్నారు. దీంతో అధికారులు, సందర్శకులకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఉన్న విహంగాల నమూనాలకు రంగులు వేయడంతో పాటు విహంగాలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చెరువుకట్టపై సందర్శకులు విశ్రాంతి తీసుకునేందుకు పలుచోట్ల సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. పక్షుల కేంద్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా కొళాయిలు, ప్లాస్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రేంజ్ అధికారి వెంకటరత్నం పర్యవేక్షించారు.

# పెంచలకోన దేవస్థానానికి భారీ రాబడి

నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో కొలువుదీరిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 1వ తేదీ ఒక్కరోజే భారీగా రాబడి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీరామమూర్తి తెలిపారు. నూతన సంవత్సరం, ముక్కోటి ఏకాదశి ఒకేరోజు రావడంతో దేవస్థానానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆ ఒక్కరోజే రూ.13,80,529 రాబడి వచ్చిందని ఇఓ తెలిపారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.3,93,529/-, తలనీలాల ద్వారా రూ.27,210, ప్రత్యేకదర్శన టిక్కెట్ల ద్వారా రూ.1,32,750, అంతరాలయ దర్శన టిక్కెట్ల ద్వారా రూ.2,81,300, నిజరూపదర్శన టిక్కెట్ల ద్వారా రూ.93,200, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.33,500, వాహనాల పూజల ద్వారా రూ.9,750, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,54,490, క్యూటిక్కెట్ల ద్వారా రూ.10,276, క్యాలెండర్ల విక్రయాల ద్వారా రూ.45వేలు వచ్చినట్లు తెలిపారు.

## ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు

# దోపిడికి యత్నం

నెల్లూరుజిల్లా కావలి పట్టణంలోని రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డులోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో ఇటీవల చోరీకి విఫలయత్నం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఈ విషయం బయటకు రావడంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఈ విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డిఎస్పీ మోహన్‌రావు, సిఐ వెంకట్రావు, ఎస్సై నాగార్జునరెడ్డి బ్యాంకును పరిశీలించారు. లాకర్లను పగులగొట్టి డబ్బులు తీసుకెళ్లేందుకు ప్రయత్నం జరిగినట్లు గుర్తించారు. కానీ లాకర్లు రాకపోవడంతో వెనుదిరిగి ఉంటారని బ్యాంకు అధికారులు, పోలీసులు అనుమానిస్తున్నారు.

**సిసి కెమెరాలు ధ్వంసం:** బ్యాంకులో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల్లో నమోదైన తీరును పోలీసులు పరిశీలించగా ఒక్కడే ముఖానికి ముసుగు కట్టుకుని, సుత్తి శానంతో వరండాలోని నాలుగు మూలలను పరిశీలించి కెమెరాలను ధ్వంసం చేశాడు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

# సోమశిల మత్స్యకారుల ఆందోళన

**- జీవనోపాధి కల్పించాలంటూ కలెక్టర్‌కు వినతి**

తమకు జీవనోపాధి కల్పించాలంటూ సోమశిల మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు పాతికేళ్లుగా సోమశిల జలాశయంలో చేపలవేట సాగిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఆ మేరకు మత్స్యశాఖ అధికారులకు రుసుము చెల్లించి లైసెన్సులు కూడా పొంది వున్నామన్నారు. అయితే, మామూళ్ల కోసం తమపై కొందరు దాడులు చేసి, వలలను దగ్ధం చేశారని, మామూళ్లు ఇవ్వలేదనే కక్షతో అధికారులకు తమపై ఫిర్యాదు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ లైసెన్సులను రద్దు చేయడంతో తాము జీవనోపాధి కోల్పోయామని వారు పేర్కొన్నారు. నిబంధనల మేరకు అధికారులు సూచించిన వలలతోనే తాము వేట సాగిస్తున్నామని, అయితే కొంతమంది తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, తమకు జీవనోపాధి కల్పించి న్యాయం చేయాలంటూ వారు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు కోదండం, శ్రీనివాసులు, పెంచలయ్య, రమేష్, నరసింహులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# 12లోగా పేదలకు సంక్రాంతి కానుక

**- వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు**



సింహపురి సమాచారం

సంక్రాంతి కానుకగా పేదలకు ఉచితంగా అందజేసే రేషన్‌సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, ఆ మేరకు ఈ నెల 12వ తేదీ లోగా రేషన్‌కార్డు దారులకు సరుకులు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. సంక్రాంతి కానుక కింద అర్ధకేజీ కంది పప్పు, అర కేజీ బెల్లం, వందగ్రాముల నెయ్యి, కేజీ గోధుమ పిండి, కేజీ శెనగలు, అర లీటరు పామాయిల్‌ను ప్రతి రేషన్ కార్డుదారుకు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా, ఈ నెల 13 నుంచి గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి దాకా సంక్రాంతి సంబరాలు నిర్వహించాలన్నారు. ముగ్గుల పోటీలు, వంటకాలు, గ్రామీణ క్రీడలైన కబడ్డీ, అదేవిధంగా రైతులు పండించిన పంటలు, పశువుల ప్రదర్శన, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని, ఎన్టీఆర్ వైద్యసేవలను సక్రమంగా అమలు చేయాలని, రుణమాఫీ కింద అర్హులైనవారికి న్యాయం కలిగేలా చూడాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, జేసీ రేఖారాణి, కార్పొరేషన్ కమిషనర్ చక్రధర్, ఏజేసి రాజ్‌కుమార్, డిఆర్‌డిఓ పి.డి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా!

**- సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి -**

నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పొదలకూరు మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, బత్తలపల్లి, భోగసముద్రం గ్రామాలకు సోమశిల కాలువ, ఉపకాలువల ద్వారా సాగునీటి సరఫరాను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొదలకూరు మండలంలో సాగునీరు అందక రైతులు సక్రమంగా పంటలు పండించలేకపోతున్నారని అన్నారు. కండలేరు ఎడమగట్టు కాలువకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేయగలిగితే చాలా గ్రామాలకు సాగునీరు అందే అవకాశం వుందన్నారు. సాగునీరు లభించే గ్రామాల్లో వరిపైరు ఎండకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన పలుగ్రామాల రైతుల సమస్యలను, సాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సోమశిల డిఇఇ రవికుమార్, ఎ.ఇ శాస్త్రి, ఎంపిపి కోన బ్రహ్మయ్య, మాజీ ఎంపిపి ఎన్ మాలకొండారెడ్డి, వైఎస్సార్‌సీపి మండల అధ్యక్షులు పెదమల్లు రమణారెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి ప్రయాణీకులకు బహుమతులు

**--- రీజనల్ మేనేజర్ రవికుమార్ ---**

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, అందువల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలను ప్రోత్సహిస్తూ ప్రజలను ఆర్టీసీకి చేరువ చేసేందుకు బహుమతులు కూడా అందజేస్తున్నామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సిహెచ్ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో 1వ డిపో ఆధ్వర్యంలో నెల్లూరు-బుచ్చిరెడ్డిపాళెం బస్సులో ప్రయాణించినవారికి లక్కీడిప్ స్కీమ్ నిర్వహించారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిటిఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ, నెల్లూరు-బుచ్చి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులు టికెట్ వెనుక పేరు, అడ్రస్, ఫోన్ నంబర్లు రాసి, డ్రైవర్‌సీటు వెనుక వుండే లక్కీ డిప్ బాక్స్‌లో వేయాలని, ప్రతి నెల 1వ తేదీ, 16వ తేదీ ఈ డిప్ ద్వారా ముగ్గురు ప్రయాణీకులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా, లక్కీడ్రా ద్వారా గెలుపొందిన బి.చంద్రబాబు, వై.శ్రీనివాసరావు, ఎం.శ్రీరామచంద్ర అనే ముగ్గురు ప్రయాణీకులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ డిపో డిఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య పాలిటెక్నిక్ కళాశాల

# అభివృద్ధికి రూ.3కోట్లు

నెల్లూరుజిల్లా రాపూరు సమీపంలోని పశు వైద్య పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి నాబార్డు కింద రూ.3కోట్లు నిధులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి తెలిపారు. ఇటీవల ఆమె కళాశాలలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నిధుల్లో రూ.2.50కోట్లతో గేదెలు, కోళ్లు, మేకలు తదితర పశువులకు సంబంధించిన భవనాలు నిర్మించుకోవాలని, మరో రూ.50 లక్షలతో 30గేదెలు, 100కోళ్లు, 100 మేకలు, గొర్రెలు కొనుగోలు చేయాల్సి వుంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు బయటకు వెళ్లి ప్రాక్టికల్స్ చేయకుండా ఇక్కడే చదువుతూ ప్రాక్టికల్స్ చేసుకునే వీలు కోసం ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసిందని ఆమె తెలిపారు.

## జాతీయ రహదారి

# విస్తరణకు మార్కింగ్

నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి విస్తరణ కోసం ఇటీవల నెల్లూరుజిల్లా సంగం మండలంలో మార్కింగ్ ఇచ్చారు. ఈ మార్కింగ్ లోపలి వైపునకు పొలాలు, ఇళ్లు రావడంతో రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దువ్వూరు, ర్యాంపు మలుపు, ఎర్రచెరువు సంగం కొండ వద్ద మార్కింగ్‌లు ఇచ్చారు. తమను సంప్రదించకుండా మార్కింగ్ ఇవ్వడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. సంగం కొండ సమీపంలో కొన్ని ఇళ్లు పూర్తిగా మార్కింగ్ పరిధిలోకి రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల పనులకు తాము వ్యతిరేకం కాదని, కనీసం సంప్రదించకుండా మార్కింగ్‌లు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

# అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు బంగారు పతకాలు

రాయలసీమ ఓపన్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభను కనపరచి బంగారు పతకాలు సాధించి, క్రీడారంగంలో జిల్లా కీర్తిపతాకను రెపరెపలాడించారు. ఆదివారం కడపజిల్లాలోని పొద్దుటూరులో నిర్వహించిన 200 మీటర్ల పరుగు పోటీల్లో జిల్లాకు చెందిన ప్రశాంత్, షాట్‌పుట్‌లో ఎస్.రాజ బంగారు పతకాలు సాధించారు. డిస్కస్ త్రోలోనూ రాజా తృతీయ స్థానంలో నిలిచాడు. అదేవిధంగా, మహిళల విభాగంలో జిల్లాకు చెందిన పార్వతి 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పోటీల్లో బంగారు పతకం సాధించారు. 400 మీటర్ల పరుగు పోటీల్లో టి. రఘు ద్వితీయస్థానం సాధించగా, కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న ఎస్‌డి నూరుల్లా 5 కిలోమీటర్ల పరుగులో ద్వితీయస్థానం సాధించాడు. 800 మీటర్ల పరుగులో పి.వెంకటేష్ తృతీయస్థానం సాధించగా, సీనియర్ విభాగంలో 800మీటర్ల పరుగులో పి.సునీల్ తృతీయ స్థానం సాధించాడు. విజేతలుగా నిలిచిన ఈ క్రీడాకారులను సోమవారం కృష్ణపట్నం పోర్ట్ జిఎం టి.రాజేంద్రప్రసాద్‌తో పాటు, పలు క్రీడాసంఘాలవారు అభినందించారు.

# నవ్యాంధ్ర ప్రగతికి కేంద్రం సాయం

## - కేంద్ర మాజీమంత్రి పురంధరేశ్వరి



నవ్యాంధ్ర రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుందని కేంద్ర మాజీమంత్రి, భారతీయ జనతాపార్టీ నాయకురాలు దగ్గుపాటి పురంధరేశ్వరి అన్నారు. నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని పద్మావతి కమ్యూనిటీహాల్‌లో బుధవారం పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యకర్తల సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పురంధరేశ్వరి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా అక్కడ భారతీయ జనతాపార్టీ మంచి విజయాలు సాధిస్తుండడం శుభపరిణామమన్నారు. గుజరాత్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసిన మోడీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల పట్ల కార్యకర్తలు, ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో దేశంలోని అన్ని వర్గాలు భాగస్వామ్యం కావడం దాని ప్రాముఖ్యతను చాటిచెబుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడంలో వెంకయ్యనాయుడు కృషి ఉందన్నారు. రానున్న రోజుల్లో పోలవరం రాష్ట్రానికి జీవనాధారం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి పెంచలరెడ్డి, అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, మిడతల రమేష్, ఆమంచర్ల శంకరనారాయణ, వరదయ్య, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సిఐడి డిఐజి బి.వి.రమణకుమార్ ఇటీవల నెల్లూరు కొండాయపాళెం గెటు వద్ద గల పోలీస్ అండ్ చైల్డ్ ప్రాజెక్ట్ (క్యాప్)ను సందర్శించారు. గతంలో నెల్లూరుజిల్లాలో ఎస్పీగా వుండగా, ఆయనే ఈ క్యాప్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి ప్రాణం పోశారు. నిత్యం అక్కడి పిల్లలతో గడిపేవారు. ఆ మమకారంతోనే మొన్న నెల్లూరు వచ్చినప్పుడు క్యాప్ పిల్లలతో కలసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్, శ్రీమతి వసంత లక్ష్మి, ఏఎస్పీ రెడ్డి గంగాధర్, డిఎస్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భారతానికి హృదయం వంటిది ఆనుశాసనిక పర్వం

## - శలాక రఘునాథశర్మ



భారతానికి హృదయం వంటిది ఆనుశాసనిక పర్వమని రాజమండ్రికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, ప్రాచార్య శలాక రఘునాథశర్మ అన్నారు. పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో జరుగుతున్న ఆంధ్ర మహాభారత ఉపన్యాసాల్లో మొదటిరోజు సోమవారం సాయంత్రం ఆనుశాసనికపర్వం ప్రథమాశ్వాసముపై ఆయన ఉపన్యసించారు. తొలుత తిక్కన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతిప్రకాశనం గావించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సినీరచయిత వెన్నెలకంటి శలాక రఘునాథశర్మ పాండిత్యం, ఆయనకు మహాభారతంపై వున్న అవగాహన గురించి వివరించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ కవి మారన, వెంకయ్య గురించి సవివరంగా వివరించారు. అనంతరం శలాక రఘునాథ శర్మను పరిషత్ సభ్యులు శాలువాతో, పూలమాలలతో సత్కరించారు.

రెండవరోజు మంగళవారం ఎలకూచి బాలసరస్వతి వేదికలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర మహాభారతోపన్యాసాల కార్యక్రమాన్ని చేపట్టి సంస్కృతి విలువను చాటుతున్న పద్యకళాపరిషత్ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ కవి కొండవీటి రామకృష్ణయ్య రచించిన సుందరకాండ(పద్య కావ్యము)ను ఆయన ఆవిష్కరించారు. ఉపన్యాసకులు శలాక రఘునాథశర్మ ఆనుశాసనిక పర్వం ద్వితీయశ్వాసం గురించి ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో సుంకు రామ్మోహన్ సభాపోషకులుగా వ్యవహరించారు.

మూడవరోజు బుధవారం రఘునాథ నాయకుడు వేదికపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఆదిత్య పాల్గొన్నారు. సభాపోషకులుగా నెల్లూరుజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వొమ్మిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం ఆనుశాసనిక పర్వము తృతీయా శ్వాసంపై శలాక రఘునాథశర్మ ఉపన్యసించారు.

ఈ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా సహస్రసభాసింహం బి.వి.నరసింహం వ్యవహరించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, యం.వేణుగోపాలయ్య, సిహెచ్ వెంటేశ్వర రావు, కె.సుందరరామయ్య, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి ఏడాది అవుతున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

కుమారుడు - కోడలు
లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి - ప్రశాంతి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

మనుమలు - మనుమరాండ్రు
సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి - శ్రుతి
సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి
నిమ్మ కౌశిక్‌రెడ్డి - సింధు
సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి - నీలిమ
యల్లా సనత్‌రెడ్డి - షాలిని
కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి - మాలిని
కేతిరెడ్డి శశధర్‌రెడ్డి - కీర్తి
కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి - స్నిగ్ధ

మునిమనుమలు
యల్లా శర్విన్
కేతిరెడ్డి శ్రీమన్
నిమ్మ ధీర్
కేతిరెడ్డి శ్రీవంత్

మునిమనుమరాండ్రు
యల్లా సంజన
సోమిరెడ్డి శివాని
కేతిరెడ్డి శ్రీతిక
కట్టంరెడ్డి శ్రీశాన్వి
సన్నారెడ్డి నిరుక్తలేఖ
సన్నారెడ్డి రాయల్ భార్గవ్

## 'ప్రభా'తం

విధి.. బలీయమైనది. కొత్త సంవత్సరం తొలి వారంలోనే రాష్ట్ర ప్రజలను కన్నీరు పెట్టించింది. జనవరి 7.. అందరినీ ఏడిపించింది. మరో వారంలో రానున్న నూతన సంక్రాంతి శోభ, ముందస్తుగానే అనేక కుటుంబాలను తీరని క్షోభకు గురిచేసింది. ఒకవైపు, రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగే తొలి సంక్రాంతి సంబరాలకు ప్రభుత్వం పెద్దఎత్తున సమాయత్తమవుతున్న తరుణంలోనే పెనుకొండ బస్సు దుర్ఘటన అటు ప్రభుత్వాన్నీ, ప్రజలను శోకతప్తులను చేసింది. అనేక కుటుంబాలకు విషాదాన్నే మిగిల్చింది.

అనంతపురం జిల్లాలోని పెనుకొండ సమీపంలో ఈ నెల 7వ తేదిన జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పెను విషాదాన్నే తలపించింది. మడకశిర నుంచి పెనుకొండకు బయలుదేరిన ఆర్టీసి పల్లెవెలుగు బస్సు, మార్గమధ్యంలో ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ 60 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో అనేకమంది దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే చనిపోయినవారు కొందరైతే, తీవ్రగాయాలతో ఆసుపత్రుల పాలై, మృత్యువుతో పోరాడి ఓడిపోయిన అభాగ్యులు మరికొందరు. బుధవారం సాయంత్రానికల్లా ఈ ఘటనలో మృతిచెందినవారి సంఖ్య 16 కు చేరింది. ఇంకా మరికొంతమంది పరిస్థితి విషమంగానే వున్నట్లు సమాచారం. మృతి చెందినవారిలో ఒక అటవీశాఖ గార్డు కూడా వున్నట్లు గుర్తించారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య మరింతగా పెరగ వచ్చని కూడా భావిస్తున్నారు. పాఠశాలలకు బస్సులో వెళ్తున్న విద్యార్థులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ తల్లిదండ్రుల రోదన హృదయ విదారకం.. కుటుంబసభ్యుల వేదన వర్ణనాతీతం. సంఘటనా స్థలమంతా నెత్తురోడుతూ భీభత్సంగా వుంది. ఈ ప్రమాదంలో చేతులు కాళ్ళు తెగిపోయి, నలిగిపోయి అల్లాడుతున్నవారు, గాయాల బాధలతో హాహాకారాలు చేస్తున్న చిన్నారులు.. పెద్దలు ఎందరో బాధితులు.. అందరి గుండెలూ ప్రాణభీతితో విలవిల లాడాయి. మృతి చెందినవారిలో ఏడుగురు ఇంటర్ విద్యార్థులు కూడా వున్నట్లు తెలుస్తోంది. బస్సు అత్యంత వేగంగా వెళ్తూ, లోయలోకి పడిపోయి నుజ్జు నుజ్జయిపోయింది. ఒక్కసారిగా ఆ మృత్యులోయలోకి పల్టీలు కొడుతూ బస్సు కిందపడిపోవడంతో, బస్సులోనూ, బస్సుకింద పడి పలువురు అక్కడికక్కడే అసువులు కోల్పోయారు. చిన్నారుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. స్కూలు పిల్లల పుస్తకాల బ్యాగులు, టిఫిన్ కారియర్లు, వగైరా సామగ్రి..బస్సు అంతా కూడా నెత్తురు చారికలతో నిండిపోయింది. గుండెలు తరుక్కుపోయే ఈ సన్నివేశాలను, మీడియాలో ఈ దృశ్యాలను చూసినవారి హృదయాలు కరిగి కన్నీరయ్యాయి. ఇంకాసేపట్లో ఆ చిన్నారులు స్కూలుకు వెళ్లారనగా, విధి వికటించింది. మధ్యలోనే మాయదారి మృత్యువు వికటాట్టహాసం చేసింది. అసలే అస్తవ్యస్తంగా వున్న డొక్కు బస్సు.. దానికి తగ్గట్టు అంతా అస్తుబిస్తుగా వున్న గతుకుల రోడ్డు, ఇవి చాలవన్నట్లు మితిమీరిన వేగం.. అన్నిటికీ మించిన దురదృష్టం..అన్నీ కలసి అనేకమంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్నాయి. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించినా, అక్కడే పొంచివున్న మృత్యువు నుంచి మాత్రం తప్పించుకోలేని..అత్యంత దయనీయమైన క్షణమది. బస్సులో వున్న ప్రయాణీకులు అంత వేగం వద్దని వారించినా వినకుండా మరింత వేగంగా డ్రైవర్ బస్సు నడిపినట్లు బాధితులు లబోదిబో మంటున్నారు. అయినా, ఆ మాటలు పట్టించుకోకుండా, మృత్యువు పిలుపును మాత్రమే వింటూ, అ బస్సును అంత నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్ కూడా చివరికి తీవ్రగాయాలతో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనలో దాదాపు 40 మంది గాయాల పాలయ్యారు. తీవ్రగాయాలకు గురైనవారిని తక్షణ వైద్యచికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగానే వున్నట్లు తెలుస్తోంది. గాయాలతో వున్నవారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు చేర్చారు.

ఈ దుర్ఘటన సమాచారం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులతో సమావేశమై రానున్న రోజుల్లో చేపట్టాల్సిన అనేక ముఖ్యమైన అభివృద్ధికర అంశాలపై చర్చిస్తున్నారు. బస్సు దుర్ఘటనలో పలువురు మృతిచెందారని తెలియగానే ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. తీవ్రగాయాల పాలైనవారికి రూ.2లక్షలు, గాయపడినవారికి లక్ష రూపాయల వంతున సాయం అందిస్తామని ప్రకటించారు. ప్రధాని మోడీ కూడా ఈ దుర్ఘటనకు చలించిపోయారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే, ఈ సంక్రాంతిని మరింత సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదలకు సంక్రాంతి సరుకులు అందించేందుకు అధికారులకు అన్ని ఆదేశాలూ జారీ చేశారు. అన్నిటికీ మించి, సంక్రాంతి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్ణయించడం విశేషం. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి దాకా అన్ని ప్రాంతాల్లో ఊరూరా సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇవన్నీ ఎంతో సంతోషభరితంగా జరుగుతున్న సమయంలోనే హటాత్తుగా వినవచ్చిన పెనుకొండ బస్సు దుర్ఘటన సమాచారం అందరినీ కంటతడిపెట్టించింది. ప్రయాణీకులతో నిండుగా వెళ్ళే పల్లె వెలుగు వంటి ఆర్టీసి బస్సులు కూడా ఇలాంటి ప్రమాదాలకు గురికావడం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సురక్షిత ప్రయాణానికి భరోసా ఇచ్చే ఆర్టీసి, ఇప్పటికైనా అలాంటి బస్సు ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణం బస్సుల నాణ్యతను, వాటి స్థితిగతులను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అవసరమైతే, పాత బస్సుల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్త బస్సులను ప్రవేశపెడుతుండాలి. ప్రమాదాలకు కారణమైన అతి వేగాన్ని నియంత్రించేందుకు బస్సుల్లోనే తగు ఏర్పాట్లు చేయాల్సివుంది. ఇదే సందర్భంలో, రోడ్లు అస్తవ్యస్తంగా వున్నప్పుడు, ఆ రోడ్లపై హెచ్చరిక బోర్డులు పెట్టడం, వీలైనంత వెంటనే రోడ్ల బాగుకు చర్యలు తీసుకోవడం వగైరాలన్నీ కూడా ఎంతో బాధ్యతాయుతంగా చేయాలి. విధి వక్రించి.. దురదృష్టవశాత్తూ జరిగే ఇలాంటి సంఘటనల్లో.. మానవ తప్పిదం లేకుండా చూసుకోవడం మాత్రం ఎంతో ముఖ్యం. అది అందరి బాధ్యత కూడా.

ఎవరెన్ని అనుకున్నా, బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల గర్భశోకం తీర్చగలమా?..ఆ కన్నీటి సంద్రాలను ఓదార్చగలమా?..ఏదేమైనా, ఈ సంక్రాంతి ముందస్తుగానే అందరికీ శోకాన్ని కలిగించి, అనేక కుటుంబాల పాలిట విషాద సంక్రాంతిగానే మిగిలిపోవడం ఎంతైనా బాధాకరం.

### విషాద సంక్రాంతి



సంబరాల సంక్రాంతిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలనుకుంటున్న వేళ.. నవ్యాంధ్రలో ప్రభుత్వం ప్రజలకు సంక్రాంతి సంబరాల సరుకులను సంతోషంగా పంచిపెట్టాలని సమాయత్తమవుతున్న వేళ.. పెనుకొండ బస్సు దుర్ఘటన అందరినీ శోకసాగరంలో ముంచింది. ఈ దుర్ఘటనలో 16మంది దాకా చనిపోవడం, మృతుల్లో అనేకమంది స్కూలు విద్యార్థులు వుండడం రాష్ట్ర ప్రజలందరికీ తీరని విచారాన్ని కలిగించింది. ఈ ఘోర దుర్ఘటనకు గురైన కుటుంబాల్లో ఈ సంక్రాంతి.. విషాదంగానే మిగిలింది.

---

## పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

**-డిఎంఅండ్‌హెచ్‌ఓ భారతిరెడ్డి**

ఈ నెల 18 నుంచి 20వ తేది వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎంఅండ్ హెచ్‌ఓ భారతిరెడ్డి కోరారు.

సోమవారం ఆమె నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో సమావేశంలో మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేయాలని, ప్రతి పిహెచ్‌సి పరిధిలో బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు పంచాలని, చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదని స్పష్టం చేశారు. పల్స్‌పోలియో కార్యక్రమం మొదటి విడతగా జనవరి 18 నుంచి 20వ తేది వరకు, రెండవ విడతగా ఫిబ్రవరి 22 నుంచి 24వ తేది వరకు జరుగుతుందని, ప్రతిఒక్కరు ఎంతో బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆమె సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. పిహెచ్‌సిలలో వైద్యులు సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు.

ఈ సమావేశంలో డిఐఓ జయసింహా, డిఎల్‌వో వేణుగోపాల్, ఎన్ఆర్‌హెచ్ఎం పిఓ పెంచలయ్య, వ్యాక్సినేషన్ ప్రత్యేక అధికారి నాయక్, ఎన్‌సిడి నోడల్ ఆఫీసర్ రవీంద్రరెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతం.. ఫ్లెమింగో సైకత శిల్పం




పక్షుల పండుగను దృష్టిలో వుంచుకుని, చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి సనత్‌కుమార్ ఇటీవల మైపాడు బీచ్‌లో ఇసుకతిన్నెలపై అత్యద్భుతంగా రూపొందించిన ఫ్లెమింగో సైకత శిల్పం పర్యాటకులను బాగా ఆకట్టుకుంది.

5 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పుతో వున్న ఈ సైకతశిల్పంలో పక్షులు, పులికాట్ సరస్సు వగైరాలను దాదాపు 3 గంటలసేపు శ్రమించి, ఎంతో కళాత్మకంగా కనువిందుగా రూపొందించారు. మన జిల్లాలో ఎంతో ప్రత్యేకతగా సాగుతున్న ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్రస్థాయి పండుగగా గుర్తించి, అందరూ పక్షులను, ప్రకృతిని సంరక్షించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## పిరాట్ల సేవలు చిరస్మరణీయం

ఎబివిపి పూర్వ ప్రధాన కార్యదర్శి పిరాట్ల వెంకటేశ్వర్లు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని, ఆయన సేవలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని వక్తలు ప్రశంసించారు. ఈ నెల 4న నెల్లూరులో పిరాట్ల సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో సామాజిక సమరసతా వేదిక దక్షిణ మధ్య భారత సంయోజకుడు కె.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సుకోసం పిరాట్ల ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఆమంచర్ల శంకరనారాయణ, రామదండు, మన్నూరు మల్లికార్జున, బలరామిరెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొని పిరాట్ల సేవలను కొనియాడుతూ, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

## జడ్పీటిసి సభ్యులకు 22 నుంచి శిక్షణ

జిల్లాలోని 46 మంది జడ్పీటిసి సభ్యులకు హైదరాబాద్‌లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జడ్పీ ఛైర్మెన్ బొమ్మి రెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. 21వ తేది సాయంత్రం నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు బస్సు బయలు దేరుతుందని, జడ్పీటిసి సభ్యులందరూ ఈ శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.




## జమ్మూను రాష్ట్రం చేయాలి

దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. కాశ్మీర్‌ను విడగొట్టి జమ్మూ లడఖ్‌ను 30వ రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి. రాజ్యాంగ సవరణ చేసైనా 370ఆర్టికల్‌ను రద్దు చేయాలి. అప్పుడే ఉగ్రవాద ఆగడాలు తగ్గుతాయి. ప్రధాని మోడీ ఈ నిర్ణయం తీసుకుంటే ప్రజలు సంతోషిస్తారు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## వేమిరెడ్డికి అభినందనలు

మన నెల్లూరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను పంచుతూ వారిని చైతన్యవంతులను చేయడం అభినందనీయం. పారిశ్రామికవేత్తగా, మంచి వ్యక్తిగా నెల్లూరుజిల్లా అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకం. అలాగే క్రమశిక్షణ గల సైనికుడిగా రామశాస్త్రి గానం చేసిన 700భగవద్గీత శ్లోకాల రికార్డింగ్ పూర్తి చేసుకోవడం మంచి పరిణామం. ఈ శ్లోకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. భగవద్గీత చదవడం, వినడం ద్వారా మనశ్శాంతి లభిస్తుంది.

**వై.విశ్వక్, నెల్లూరు.**

## చిత్రగుప్తుని చిట్టాలోకి

ఆత్మహత్యలు చేసుకోవడం నేరం కాదు కానీ ఆత్మహత్యలకు పాల్పడేందుకు కారణభూతులైన నరహంతకులు చిత్రగుప్తుని చిట్టాలోకి ఎక్కడం ఖాయం! అలాంటి వారిని శిక్షించడం ఎంతైనా అవసరం.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**



# ఊరిస్తూ... ఊరేగిస్తున్న విమానం

*రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకొక ఎయిర్‌పోర్ట్ వస్తుందంటాడు. జిల్లాకు చెందిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు మాత్రం జిల్లాకు ఎయిర్‌పోర్టు వచ్చే అవకాశమే లేదని, దానిని నమ్మి ఎవరూ భూములు కొనద్దని చెబుతాడు. ఎవరి మాటలు నమ్మాలో అర్థంకాక జనం జుట్టు పీక్కుంటున్నారు. ఇంతకీ ఎయిర్‌పోర్టు వస్తున్నట్లా? రానట్లా? విమానం ల్యాండవుతుందా? లేదా? ఇదో పెద్ద పజిల్‌గా మారింది.*

ఎందుకంటే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణకు శ్రీకారం చుట్టారు. అయితే వై.యస్. మరణానంతరం మొన్నటి ఎన్నికల దాకా కూడా ఈ ప్రతిపాదన ఊసు లేకుండా పోయింది. కాగా, ఇప్పుడు మళ్ళీ ఎయిర్‌పోర్టుపై ఆశలు మొలకెత్తుతున్నాయి. ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన నలుగురు నిపుణుల బృందం దామవరం సమీపంలోని ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత భూములను పరిశీలించింది. ఈ బృందం ఇచ్చే నివేదిక పైనే నెల్లూరు జిల్లాకు ఎయిర్‌పోర్టు వస్తుందా లేదా అన్నది ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా నెల్లూరులో ఎయిర్‌పోర్టు కడితే దానికి తగ్గట్లుగా రాబడి ఉంటుందా అనేది ప్రధాన కొలమానం కాబోతుంది. నెల్లూరుకు 120 కిలోమీటర్ల దూరంలో రేణిగుంట, 180కిలోమీటర్ల దూరంలో చెన్నై ఎయిర్ పోర్టులున్నాయి. నెల్లూరుజిల్లా నుండి నిత్యం హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి ప్రాంతాలకు పోయేవాళ్లు చెన్నై లేదా రేణిగుంట ఎయిర్‌పోర్టులకెళ్లే పోతుంటారు. ప్రస్తుతం తాత్కాలిక రాజధాని హైదరాబాద్‌లోనే వుంది కాబట్టి ప్రజాప్రతినిధులు కూడా రేణిగుంటకెళ్లి అక్కడ నుండే విమానాలలో హైదరాబాద్ పోతున్నారు. రాజధాని విజయవాడకు మారితే హైదరాబాద్‌తో సంబంధాలు తగ్గుతాయి. అప్పుడు విమాన ప్రయాణాలు కూడా తగ్గే అవకాశముంది. విజయవాడకు రోడ్డు మార్గాన నాలుగు గంటల ప్రయాణం, ఏ సమయంలోనైనా బయలుదేరొచ్చు. కాబట్టి విజయవాడకు విమానాల అవసరం పెద్దగా ఉండదు. కాకపోతే నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. జపాన్‌తో పాటూ ఇంకా ఎన్నో దేశాలు తమ పరిశ్రమలను కృష్ణపట్నంపోర్టు సెజ్‌లో పెట్టబోతున్నాయి. విదేశాల నుండి వచ్చే పారిశ్రామిక వేత్తలు, నిపుణుల కోసం ఒక ఎయిర్‌పోర్టు అయితే అవసరం. దామవరం వద్ద భూమి అనువుగా వుందని నిపుణుల అభిప్రాయం. అలాగే నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అనువుగా ఉంటుంది. ఎయిర్‌పోర్టు పెట్టాలనుకుంటే భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇక్కడే పెట్టడం ఉత్తమం. లేదంటే అసలు ఎయిర్‌పోర్టు ఊసే ఎత్తకపోవడం ఇంకా ఉత్తమం.

# తిరగబడుతున్న బోర్డు...

- వందల కోట్లలో బకాయిలు
- లబోదిబోమంటున్న బాధితులు
- అంతులేకుండా ఫైనాన్స్ మోసాలు

మోసం చేసేవాడికి మోసపోయేవాడు ఎప్పుడూ లోకువే! చరిత్ర మనకు ఎన్నో సాక్ష్యాలనిచ్చింది. ఇకనన్నా తెలివి తెచ్చుకోమని గుణపాఠాలను నేర్పింది. ఒక నాగార్జున ఫైనాన్స్, ఒక ఆర్‌బిఐఎఫ్, ఒక సిటీ ఫైనాన్స్, ఒక చైన్‌లింక్ స్కీం, మొన్నటికి మొన్న మనీస్కీం... ఇలాంటి ఉదాహరణలు వందల కొద్దీ ఉన్నాయి. అవన్నీ కూడా పైసా పైసా కూడగట్టి వాటికి తమ ఆశలను మూటకట్టి సామాన్య ప్రజలు దాచుకున్న డబ్బులను దోచుకున్న సంస్థలే! పేదవాడు రక్తాన్ని చెమటగా మలచి సంపాదించుకున్న డబ్బంటే వీరికి లెక్క లేదు. జనం సొమ్మును వందలు, కోట్లలో స్వాహాచేస్తూనే వున్నారు. ఇన్ని బోర్డులు తిప్పేసిన ఫైనాన్స్ కంపెనీల చరిత్ర కళ్ల ముందున్నా కూడా అమాయకజనం తాము మోసపోయే అలవాటును మాత్రం మార్చుకోలేకపోతున్నారు.

ఆ క్రమంలోనే ఇంకోసారి మోసపోయారు. అగ్రిగోల్డ్... ఈ సంస్థ గురించి తెలియనివారు బహుశా రాష్ట్రంలోనే ఉండకపోవచ్చు. ఈ సంస్థ ఫైనాన్స్‌తో పాటూ రియల్‌ఎస్టేట్, రిసార్ట్స్, వారపత్రిక, జిమ్‌లు వంటి వ్యాపారాలను నిర్వహిస్తుంది. అగ్రిగోల్డ్ పేరుతో రాష్ట్రంలోని అన్ని ముఖ్యపట్టణాలలో శాఖలను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పెద్దకాకాని వద్ద 'హాయ్‌లాండ్' పేరుతో పెద్ద టూరిజం సెంటర్‌నే ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఉత్పత్తుల గురించి పత్రికలు, టీవీలలో పెద్దఎత్తున ప్రకటనలు కూడా వస్తుండేవి. ఇవన్నీ చూసే ఈ సంస్థ ప్రజల్లో నమ్మకం పెంచుకుంది. ప్రజల్లో పరపతి, స్థానికంగా నమ్మకం ఉన్న వ్యక్తులను తన ఏజెంట్లుగా మార్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నుండి వందలకోట్లలో డిపాజిట్లు సేకరించారు. మూడేళ్లకు, ఐదేళ్లకు కాల పరిమితితో బాండ్లు జారీ చేశారు. కొంత కాలం క్రితం వరకు నిర్ణీతకాలం పూర్తయి బాండ్లకు డిపాజిట్ సొమ్ముకు వడ్డీని కలిపి ఇస్తూ వచ్చారు. గత కొన్ని నెలలుగా మెచ్యూరిటీ అయిన (మిగతా 10వ పేజీలో)

• కార్పొరేటర్ల నిర్వేదం

# మనీ లేదు... పనీ లేదు!

*నిధులు లేవు.. డివిజన్‌లో ఒక్క అభివృద్ధి పని చేసే దిక్కు లేదు... కనీసం చెత్తను ఎత్తే పరిస్థితి లేదు... ఈ దిక్కుమాలిన పదవిలో ఉండి కూడా ఉపయోగం లేకుండా పోయింది. నెల్లూరు నగరపాలక సంస్థలో ఆ పార్టీ ఈ పార్టీ అని తేడా లేకుండా అన్ని పార్టీల కార్పొరేటర్ల ఆవేదన ఇది.*

నెల్లూరు నగరపాలక సంస్థలో 54డివిజన్‌లున్నాయి. గత ఏడాది మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఈ 54మంది కూడా డబ్బు బాగానే ఖర్చుపెట్టి గెలిచిన వాళ్లే. ఒక్కో కార్పొరేటర్‌కు 20లక్షల నుండి కోటి రూపాయల దాకా ఖర్చయ్యింది. ఇంత ఖర్చుపెట్టుకుని గెలిచినా, కార్పొరేటర్ అనే ఫీలింగ్ వారిలో లేకుండా పోతుంది. దానికి కారణం తమ తమ డివిజన్‌లలో వాళ్లు చిన్నపని కూడా చేయలేక పోతుండడమే! అన్ని డివిజన్‌లలో కూడా సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ప్రతి డివిజన్‌లోను త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు కామన్‌గా ఉన్నాయి. ఇక చెత్తాచెదారం, దోమలు, పందులు, కుక్కల సంగతి ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. డివిజన్‌లలో కనీస కార్యక్రమాలు చేపట్టేదానికి కూడా దిక్కు లేదు. డివిజన్‌లలో ఒక్క చెత్తకుండీని కూడా పెట్టించుకోలేకపోతున్నారు. ప్రతిరోజూ స్థానికుల నుండి కార్పొరేటర్లకు సమస్యలు వస్తూనే ఉన్నాయి. పారిశుద్ధ్యం, కుక్కలు, పందులు, దోమల బెడద తీవ్రంగా వుంది. చెత్తకుండీల వద్ద చెత్తను ఎత్తడం లేదు. మురికి కాలువల్లో సిల్ట్ తీయడం లేదు. దోమలు రక్తం పీలుస్తున్నాయి. నిద్ర లేచింది మొదలు వీధుల్లో మనుషుల కంటే ఎక్కువగా పందులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కార్పొరేటర్లు వీటిలో ఏ ఒక్క సమస్యనూ తీర్చలేకపోతున్నారు. గతంలో కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా పనిచేసిన వారితో పోలిస్తే ప్రస్తుత కార్పొరేటర్ల పరిస్థితి దీనాతిదీనంగా వుంది. గత 15ఏళ్ల కాలంలో కౌన్సిలర్లు గాని, కార్పొరేటర్లుగా చేసిన వాళ్లు గాని తమ డివిజన్‌లలో రాజ్యమేలారు. కాంగ్రెస్ హయాంలో అయితే ఆనం వాళ్ల హవానే నడవడంతో పార్టీలకతీతంగా కార్పొరేటర్లు వారితో సన్నిహితంగా మెలుగుతూ తమ తమ డివిజన్‌లకు నిధులు సాధించుకున్నారు. సి.సి.రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైప్‌లైన్‌లు వంటి పనులను చివరి మూడేళ్లలో భారీ ఎత్తునే చేశారు. ఈ పనులు చేసి బాగానే సంపాదించుకున్న కార్పొరేటర్లు కూడా ఉన్నారు. కార్పొరేటర్ అయితే వారిలాగానే హవా వుంటుందని డబ్బు ఖర్చు చేసుకుని మరీ కార్పొరేటర్లయిన వాళ్ళు ఇప్పుడు కార్పొరేషన్‌లో నెలకొన్న పరిస్థితులను చూసి డీలా పడుతున్నారు.

# పదవుల రేసులో.. ముందువరుసలో..



*2014 రాష్ట్రంలోని ప్రజలనే కాదు, రాష్ట్ర రాజకీయనాయకులను కూడా నిరాశ పరచింది. అధికారం రాకపోవడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు నిరాశ చెందితే, అధికారం వచ్చినా కూడా కోరుకున్న పదవులు రాక జిల్లాలోని తెలుగుదేశం నాయకులు అసంతృప్తిగా వున్నారు. కనీసం కొత్త సంవత్సరంలోనైనా కొత్త పొజిషన్ వస్తుందేమోనని వీరు ఆశగా ఎదురుచూస్తున్నారు.*

జిల్లా తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారి లిస్టు భారీగానే వుంది. అయితే వారిలో కొందరి ఆశలు మాత్రమే చిగురించే అవకాశాలు కనపడుతున్నాయి. ముఖ్యంగా త్వరలో రాష్ట్రంలో 23ఎమ్మెల్సీలను భర్తీ చేసే అవకాశమున్నందున పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆ దిశగా ఆశలు, అవకాశాలున్నాయి. పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీని ఆశిస్తున్నారు. అది కుదరకుంటే రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర రాజ్యసభకు టెండర్ పెట్టి వున్నారు. ఆయన మొదట టిటిడి ఛైర్మన్‌నే అడిగారు. అయితే చంద్రబాబు దానిని వేరేవాళ్లకు వాగ్దానం చేసి వుండడంతో బీదకు ఛాన్స్ లేకుండా పోయింది. రవిచంద్ర రాజ్యసభే కావాలనుకుంటే ఇంకొంతకాలం ఆగక తప్పదు. అలాకాకుండా ఎమ్మెల్సీతో అడ్జస్ట్ అయ్యే పనైతే రేపు భర్తీ చేసే 23 మందిలోనే వీరికి అవకాశం వుంటుంది. అయితే దానిని రవిచంద్ర తీసుకుంటారా లేక మస్తాన్‌రావుకిస్తారా? అనేది వారి కుటుంబ విషయం. రాజ్యసభ ఇచ్చే ఛాన్స్ లేకుంటే మస్తాన్‌రావుకు ఎమ్మెల్సీ, తనకు 'నుడా' ఛైర్మన్ పదవి కావాలని రవిచంద్ర కోరే అవకాశముంది.

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా రంగంలోకి దిగి నష్టపోయిన డాక్టర్ జడ్.శివప్రసాద్ 'నుడా' ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అది లేకుంటే రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్ పదవిని కోరినట్లు తెలుస్తుంది. వైద్య రంగంలో అనుభవజ్ఞుడు కావడం, పార్టీ పేరుతో వైద్యపరంగా చేసిన సేవలు ఆయనకు కలిసొచ్చే అంశాలు. ఈ పదవికి పెద్దగా పోటీ లేకపోవడంతో ఆయనకు అవకాశముండొచ్చు. పార్టీలో చంద్రబాబు కంటే సీనియర్, పార్టీ పుట్టినప్పటి నుండి పసుపు జెండానే మోస్తూ, మొన్న జడ్పీ ఎన్నికల్లో లాటరీ రూపంలో అదృష్టం తిరగబడి ఛైర్మన్ సీటును దక్కించుకోలేకపోయిన సీనియర్ నాయకుడు వేనాటి రామచంద్రారెడ్డి టిటిడి బోర్డు సభ్యత్వం ఆశిస్తున్నారు. అంతకు మించి ఆయన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఆశించడం లేదు. ఖచ్చితంగా ఆయనకు ఇవ్వదగ్గ పదవి. ఇవ్వడానికి అన్ని విధాలా అర్హుడు కూడా! ఇక కిలారి వెంకట స్వామినాయుడు నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లుగా తెలుస్తుంది. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి కోసం అనూరాధ, అంచల వాణి పోటీ పడుతున్నారు. అయితే వీరిద్దరికీ ఆ పదవి దక్కకపోవచ్చు. కాని వీరిలో ఒకరికి మాత్రం స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ డైరెక్టర్ పదవి దక్కే అవకాశముంది. సూళ్లూరుపేటలో పార్టీకి కీలకమైన వ్యక్తి గంగాప్రసాద్ శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం.

నామినేటెడ్ పదవుల ఆశాజీవులలో ఇంకా పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాద్, కంభం విజయరామిరెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, గూటూరు కన్నబాబు వంటివాళ్లున్నారు. ఇక బీజేపీ నాయకులు కూడా ఈ రేసులో ఉన్నారు. జిల్లాలోని ఆలయాలు, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌లు, డైరెక్టర్ల పదవులకు కూడా పోటీ తీవ్రంగా వుంది. త్వరలో పోస్టుల పంపకం పూర్తయితే పదవులు వచ్చినవాళ్ళు హ్యాపీగానూ, పదవులు రానివాళ్ళు ఆ బాధను దిగమింగుకునే పనిలోనూ ఉంటారు.



# కార్పొరేషన్ 'స్వచ్ఛ' నెల్లూరు

'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా, నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలంటూ పెద్దఎత్తున ఫ్లెక్సీలు, ప్రచారపత్రాలతో ర్యాలీ నిర్వహించారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో జరిగిన ఈ భారీ ర్యాలీలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత, పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్ళి చెత్తను సేకరించారు. ఇళ్ళలోనూ, పరిసరాల్లోనూ పరిశుభ్రత వుండేవిధంగా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ నెల్లూరు' కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రతతోనే ప్రాంతాల అభివృద్ధి పురోగమిస్తుందన్నారు. దేశమంతా పరిశుభ్రతతో వుండాలన్న గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోడీ అక్టోబర్ 2న స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టారన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను ప్రారంభించారన్నారు. స్వచ్ఛ నెల్లూరు కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించి విజయవంతం చేయాలన్నారు.

మేయర్ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. గాంధీజీ స్ఫూర్తితోనే ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛ భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆ తర్వాత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛ నెల్లూరు కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని కృష్ణపట్నం పోర్ట్ అధికారులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, అడిషనల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఇ ఇమాముద్దీన్, నీలకంఠారెడ్డి తదితరులతో పాటు పలువురు కార్పొరేటర్లు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

# యోగా విజేతకు నారాయణ అభినందనలు



జాతీయ యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన జ్యోష్ణవి బంగారు పతకం సాధించింది. జ్యోష్ణవి 2వ తేదీ రాత్రి రాష్ట్ర మంత్రి నారాయణను నారాయణ వైద్య కళాశాల ఆవరణంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జాతీయ యోగాపోటీల్లో 30ఏళ్ళ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు జ్యోష్ణవి బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. ఇటీవల దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో జరిగిన ఆసియా యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో జ్యోష్ణవి వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, టీం విభాగంలో కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 26 నుంచి 30వరకు జరిగిన అండర్–14 జాతీయ యోగా పోటీల్లో బంగారు పతకం సాధించి ఛాంపియన్‌గా నిలవడం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. యోగా క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఏసిబి ఇన్‌స్పెక్టర్ బదిలీ

నెల్లూరు అవినీతి నిరోధకశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు విజయవాడకు బదిలీ అయ్యారు. వెంకటేశ్వరరావు నాలుగేళ్ళపాటు ఏసిబి ఇన్‌స్పెక్టర్‌గా నెల్లూరుజిల్లాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయనను బదిలీ చేస్తూ ఏసిబి ప్రధాన కార్యాలయం నుంచి ఇటీవల జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి.

# నెల్లూరు కబుర్లు

# సంక్రాంతికి ఉండని వెంకయ్య



కేంద్రమంత్రి యం.వెంకయ్యానాయుడుకు సంక్రాంతి పండుగ అంటే ఎంతో ఇష్టం. ఆ పండుగను తన సొంతూరైన శ్రీరామపురంలో జరుపుకోవడమంటే మహాఇష్టం. ప్రతి ఏటా ఆయన సంక్రాంతి పండుగను, భోగి మంటలను నెల్లూరుజిల్లాలోనే ఎంజాయ్ చేసే వాళ్లు. కాని ఈసారి మాత్రం సంక్రాంతి పండుగ మూడురోజులు అంటే 14, 15, 16తేదీలలో ఆయన నెల్లూరులో ఉండలేకపోతున్నాడు. ఢిల్లీలోనే ఉండి సంక్రాంతిని చేసుకోబోతున్నారు. అందుకోసమే ముందుగానే 10, 11తేదీలలో నెల్లూరొచ్చి ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకోబోతున్నారు. ఆ రెండురోజులు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సంక్రాంతి వేడుకలు జరుగనున్నాయి. 11వ తేదీ ఈ వేడుకలకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, సినీహీరో పవన్ కల్యాణ్‌లు రానున్నారు.

# సంక్రాంతి కానుక పోస్టర్



సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు నిత్యావసరాల ప్యాక్‌ను కానుకగా అందివ్వాలని నిర్ణయించడం జరిగింది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రతి తెల్లరేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సెల్ టవర్లపై మేయర్ సమీక్ష

నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా పెడుతున్న సెల్‌టవర్లపై మేయర్ అబ్దుల్ అజీజ్ 5వ తేదీ నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ముప్పులేదనుకుంటేనే సెల్‌టవర్ల ఏర్పాటుకు అనుమతినివ్వాలని ఆయన అధికారులకు సూచించారు. నగరంలో దాదాపు 500సెల్‌టవర్లు ఉన్నాయని, వాటిలో అధికశాతం అనుమతిలేకుండా ఉన్నవేనని, వాటిపై సర్వేచేసి నివేదికనివ్వాలని ఆదేశించారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, మెడికల్ హెల్త్ ఆర్గనైజేషన్‌ల నుండి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని సర్టిఫికెట్లు తెస్తేనే సెల్ కంపెనీలకు టవర్ల ఏర్పాటుకు అనుమతినివ్వాలని ఆయన సూచించారు. సెల్ కంపెనీల నుండి నగరపాలక సంస్థకు 4కోట్లకుపైగా బకాయిలు రావాల్సివుందని, వాటిని వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఇ ఇమాం మొహిద్దీన్, సిపిఓ శ్రీనివాసులు, ఏసిటిపిఓ వరప్రసాద్, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# బాడీ బిల్డింగ్ క్రీడాకారులు ఎంపిక



గుంటూరులో ఈ నెల 10, 11 తేదీలలో జరుగనున్న రాష్ట్రస్థాయి యం.ఆర్. ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు నెల్లూరుజిల్లా నుండి బాడీబిల్డింగ్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నెల్లూరు జిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.వి.పవన్‌కుమార్ తెలిపారు. 55కేజీల విభాగంలో పి.లక్ష్మీనారాయణ, ఆర్.ఎలీషా, 60కేజీల విభాగంలో వి.శ్రీనివాసులు, 65కేజీల విభాగంలో యం.రవితేజ, ఎ.ధనశ్రీనివాసులు, కె.మనోజ్, ఎ.రజనీకాంత్, వి.మునిభాస్కర్‌రావు, 80కేజీల విభాగంలో ఎస్.హార్స్‌లీ ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పిరాల సుబ్రహ్మణ్యం, డి.వి.శేషయ్య, కార్పొరేటర్ వై.రాజేష్, డా॥ వి.దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రంగడి ఆదాయం 2.15లక్షలు

నెల్లూరు రంగనాయకులపేటలో వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా హుండీల ద్వారా రూ.2,15,184లు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేగూరు రవీంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. ముక్కోటి పర్వదినం సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు.

# పోస్టాఫీసులో శ్రీవారి టిక్కెట్లు

తిరుమలలో శ్రీవారి దర్శనానికి సంబంధించిన 300రూపాయల టిక్కెట్లు ఇకనుండి నెల్లూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో కూడా లభించనున్నాయి. సోమవారం నుండి ఈ కార్యక్రమం ప్రారంభించారు. టిక్కెట్ కావాల్సినవారు ఆధార్, రేషన్, ఓటరు వంటి గుర్తింపు కార్డుతో వచ్చి టిక్కెట్లు పొందవచ్చు.

# తక్కువ తగ్గిన చలి


జిల్లాలో చలి వాతావరణం ఒక్కసారిగా తగ్గిపోయింది. నిన్న మొన్నటివరకు కూడా చలి లమ్మసింగిలో మాదిరిగా ఉండింది. అలాంటి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. చలి అన్నదే లేదు. ఎండాకాలంలో ఎలా ఉక్కపోత వాతావరణం ఉంటుందో ప్రస్తుతం అలాంటి వాతావరణమే నెలకొంది. ఈ సీజన్‌లో ఎముకలు కొరికే చలి ఉండాలి. చలి మాటే లేకుండా పోయింది.

# డాక్టర్ బిందుమీనన్‌కు బెజోరియా అవార్డు



నెల్లూరు సింహపురి ఆసుపత్రిలో న్యూరోఫిజిషియన్ ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ హరీష్‌చంద్రకు మూర్ఛవ్యాధిపై చేసిన సేవాకార్యక్రమాలకు గాను బెజోరియా అవార్డుకు ఎంపికయ్యారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, మూర్ఛవ్యాధిగ్రస్తులకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలకు గాను ఈ అవార్డు లభించిందని బిందుమీనన్ పేర్కొన్నారు. చెన్నైలో ఈ అవార్డును ఫిబ్రవరి నెలలో అందుకోనున్నట్లు తెలిపారు. తన సేవాప్రతిభతో ప్రతిష్టాత్మకమైన అవార్డును సాధించిన డాక్టర్‌కు 'లాయర్' అభినందనలు.

# ఆకట్టుకుంటున్న 'వెండి ఫ్లెమింగోలు'



ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పురస్కరించుకుని, నెల్లూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు షేక్ ముసవ్వీర్ తన అద్భుత కళాప్రతిభను ప్రదర్శించారు. 2500 మిల్లీగ్రాముల వెండితో ఫ్లెమింగో పక్షులను కనువిందుగా రూపొందించారు. ఈ సూక్ష్మ కళారూపం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ కళారూపాన్ని రూపొందించేందుకు 48 గంటల సమయం పట్టిందని, జిల్లాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే పక్షుల పండుగ విజయవంతం కావాలని కోరుకుంటూ దీనిని రూపొందించానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# మాస్టర్‌ప్లాన్‌పై మిస్టర్స్ ఫైట్!





నెల్లూరులోని గొలగమూడిరోడ్డు ఇప్పుడు రాజకీయ వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. అన్నమయ్య సర్కిల్ నుండి గొలగమూడి వరకు 60అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డుంది. గత ప్రభుత్వంలో మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి నుండి గొలగమూడి వరకు రోడ్డును 60అడుగులకు విస్తరించే కార్యక్రమం కూడా మొదలైంది. అయితే అన్నమయ్య సర్కిల్ నుండి ఇస్కాన్ మందిరం వరకు 40అడుగులరోడ్డే ఉండడాన్ని ఇటీవల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గమనించారు. 2012 మాస్టర్ ప్లాన్‌లో ఈ రోడ్డులో కొంత భాగం మాత్రం 40అడుగులు ఉండడం, మిగతారోడ్డు 60అడుగులుగా ఉండడం గుర్తించారు. దీనిపై కోర్టులో పిటిషన్ వేశారు. ఇక్కడ మాస్టర్‌ప్లాన్ రోడ్డు 40అడుగులే ఉండడానికి కారణం గత పాలకులేనంటూ ఆయన మాజీఎమ్మెల్యే వివేకా, మాజీమేయర్ శ్రీమతి భానుశ్రీలనుద్దేశించి విమర్శలు చేశారు. మాస్టర్‌ప్లాన్ అధికారులు రూపొందిస్తారని, తాము కాదని, మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డును తగ్గించడానికి అక్కడ తమ స్థలాలు, భూములు లేవని వివేకా ఎదురుదాడికి దిగారు. హైకోర్టు మాత్రం ఈ రోడ్డును 60అడుగులకు విస్తరించాలని ఆదేశించడంతో అనమ్మయ్య సర్కిల్ నుండి ఇస్కాన్ మందిరం వరకు అటు 10 ఇటు 10అడుగుల చొప్పున రోడ్డు విస్తరణ పనులను మొదలుపెట్టారు.

# పేద పాఠశాలలకు చేయూత




దాత వేమిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, మేయర్ అజీజ్

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సొంత నిధులు మరియు స్నేహితుల సహాయంతో బివి నగర్‌లోని కెయన్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌కి అన్ని రకాల హంగులు సమకూర్చారు. గత రెండు నెలల క్రితం కెయన్ఆర్ హైస్కూల్‌ని తాను దత్తత తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. వెంటనే స్కూల్‌పై ప్రత్యేక దృష్టి సారించి మినరల్ వాటర్ ప్లాంట్, 40మంచినీటి కుళాయులు, మైకు వసతి, క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. 10మంది విద్యా వాలంటీర్లను నియమించి వారికి అయ్యే జీతాలను ఎమ్మెల్యే స్వయంగా అందజేస్తున్నారు. లేబరేటరీకి ఫర్నీచర్, స్కూల్‌కి ఫ్యాన్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఆత్మీయ అభివృద్ధి సభ 3వ తేదీ స్కూలు ఆవరణలో జరిగింది. విద్యార్థిని, విద్యార్థులు భారీసంఖ్యలో తల్లిదండ్రులు, స్థానికంగా రాజకీయాలకు అతీతంగా పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పిస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చదువు భారం కాకుండా ఉంటుందన్నారు. అందుకే రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పాఠశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా తనవంతు కృషి చేస్తానన్నారు.

సభలో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు యరబోలు అపర్ణ, బొల్లినేని శ్రీవిద్య, పాతపాటి శ్రీలక్ష్మి, సిద్ధార్థ స్కూల్ అధినేత్రి మొయిళ్ళ గౌరి, వైసిపి నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, మొయిళ్ళ సురేష్‌రెడ్డి, చేజర్ల మహేష్‌బాబు, తాళ్ళూరు సురేష్, కొండారెడ్డి, గోపిరెడ్డి, శేషారెడ్డి, వెంకట రమణయ్య, పాతిపాటి పుల్లారెడ్డి, ముని స్వామిరెడ్డి, దైవాదీనం, కొండలరావు, అవినాష్‌రెడ్డి, రాజారెడ్డి, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వేమిరెడ్డి రెండు లక్షల విరాళం:**

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దత్తత తీసుకున్న కెయన్ఆర్ హైస్కూల్ అభివృద్ధి కోసం తనవంతుగా రెండు లక్షల రూపాయలు అందజేస్తానని స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిసి ఈ స్కూల్‌లో ఆ రెండు లక్షలతో మరిన్ని మెరుగైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు.

### కలెక్టర్ చొరవతో...

# పక్షుల కేంద్రానికి తరలిన గంగమ్మ



జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల చొరవతో ఎట్టకేలకు నేలపట్టులోని పక్షులకేంద్రానికి గంగ నీరు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ పక్షుల కేంద్రంలోని రెండు చెరువులకు నీటికొరత లేకుండా, గంగ నీరు వచ్చేలా జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి తగు చొరవ తీసుకున్నారు. అక్కడ కాలువ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో, ఎంతో కాలం నుంచి పక్షుల కేంద్రానికి వున్న నీటి సమస్య తీరబోతోంది. వన్యప్రాణి విభాగంవారు, నీటిపారుదల అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం ఆ మేరకు నెల్లూరుపల్లి సమీపంలో తెలుగుగంగ 14ఆర్ మేజర్ కాలువ నుంచి అటవీప్రాంతం మీదుగా కాలువ తీసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పక్షుల కేంద్రంలోని చెరువులోకి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ పొడవునా ఈ కాలువ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లోనే ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. పక్షులకేంద్రంలోని రెండు చెరువులకు ఇప్పుడు జరుగనున్న పక్షుల పండుగ కోసం తాత్కాలికంగా నీరు సరఫరా చేస్తామని, నిధులు మంజూరైన తర్వాత శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేపడతామని తెలిపారు. కాగా, ఈ కాలువ నిర్మాణం పూర్తిస్థాయిలో పూర్తయితే, పక్షుల కేంద్రానికి తెలుగుగంగ నీరు చేరుకుని విదేశీ వలస పక్షులకు నీటి సమస్య తీరుతుందని ప్రజలు సంతోషిస్తున్నారు. అదేవిధంగా, నేలపట్టు, మైలాంగం గ్రామాల్లో సాగునీటి సమస్యలు కూడా తీరుతాయని భావిస్తున్నారు.

# కళాత్మకంగా ముగ్గుల పోటీలు



నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జరిగిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్టు మిత్రమండలి సభ్యుడు చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ ముగ్గుల పోటీలను నియోజకవర్గ స్థాయిలో జిల్లా వ్యాప్తంగా 11చోట్ల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి, సినీహీరో పవన్‌కల్యాణ్ చేతులమీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 8వేలు, 5వేలు, 3వేల రూపాయలు అందించనున్నారు.

# ప్రవక్త బోధనలు శాంతికి బాటలు



నెల్లూరు నగరంలోని కోటమిట్ట మీరామొహిద్దీన్ దర్గా వద్ద మిలాడినబి పండుగ సందర్భంగా నెల్లూరు నగర వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎస్ఆర్.ఇంతియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు, సోదరీమణులకు మిలాడినబి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్‌ప్రవక్త యొక్క ఆశీస్సులు ప్రతి కుటుంబానికి వుండాలని అలాగే ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈరోజు మహ్మద్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని ఇంతియాజ్ నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఎం.డి.ఖలీల్‌అహ్మద్, గోగుల నాగరాజు, నాయకులు ఎస్.ఆర్.ఇంతియాజ్, ఎం.డి.ముస్తాక్‌అహ్మద్, వీరబ్రహ్మం, ఆబిద్, జావీద్, ఖలీల్ అహ్మద్, ఇలియాజ్, రియాజ్, హంజాహుస్సేన్, యువజన విభాగం నగర అధ్యక్షులు గంధం సుధీర్‌బాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.హాజీ తదితరులు పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో నెల్లూరీయుల ప్రతిభ

రాష్ట్రస్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన క్రీడాకారులు 15మెడల్స్ సాధించినట్లు నెల్లూరుజిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జెడ్.శివప్రసాద్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆర్.ఎస్.ఎఫ్.ఐ పోటీల్లో 15పతకాలు సాధించగా, ఎస్‌జిఎఫ్‌ఐ పోటీల్లో 12మెడల్స్, సిబిఎస్ఇ పోటీల్లో రెండు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కృష్ణపట్నం పోర్టు సహకారంతో నెల్లూరులో త్వరలో జాతీయస్థాయి రింక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జి. ఈశ్వర్, ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ రామ్మూర్తి, కోచ్‌లు ప్రసాద్, జితేంద్ర, భరత్ తదితరులు పాల్గొన్నారు.




### ప్రమాదంలో గాయపడ్డ
# లిటిల్ ఏంజల్స్ విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థి తండ్రికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్

చిల్లకూరు మండలంలోని తీపనూరుగ్రామంలో డిసెంబర్ 22వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో లిటిల్ ఏంజల్స్ స్కూల్ విద్యార్థి జీవన్ గాయపడి చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించి రూ. 60వేలు నగదును సమకూర్చి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా మంగళవారం విద్యార్థి తండ్రి మస్తానయ్యకు అందజేశారు. త్వరగా కోలుకోవాలని వారంతా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఏపి పాఠశాల కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నమశ్శివాయ, కె.మునిగిరీష్, పూర్వవిద్యార్థి రామకృష్ణ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# డిప్లొమో ఇంజనీర్ల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

పంచాయితీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇటీవల ఆశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఇంజనీర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ కార్యదర్శి జవహర్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు హనుమంతరావు, రాంబాబు, కేశవులు, ఆర్‌డబ్ల్యూయస్, పిఆర్‌సిఇలు రవిబాబు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలకు కంప్యూటర్ ఇస్తున్న జగన్మోహన్‌రెడ్డి

# జూనియర్ కళాశాలకు కంప్యూటర్

చవటపాలెంలోని జగన్ ఇంజనీరింగ్ కాలేజీ తరపున ఆ కాలేజీ ఛైర్మెన్ యస్.వి.జగన్మోహన్‌రెడ్డి 30వేల రూపాయలు విలువచేసే కంప్యూటర్‌ను మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా కాలేజీ ఛైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న పేద విద్యార్థులకు ఇంగ్లీషు అభివృద్ధి చేసేందుకు కంప్యూటర్‌ను బహుకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మౌలాలి, జగన్ ఇంజనీరింగ్ కాలేజీ అకడమిక్ ఇన్‌ఛార్జి వి.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో మార్పు




- డాక్టర్ సిఆర్ రెడ్డి

విద్యతో ప్రపంచాన్ని మార్చగల శక్తి వస్తుందని డాక్టర్ సి.ఆర్.రెడ్డి తెలిపారు. పట్టణంలోని దిగువవీరారెడ్డిపల్లెలో వున్న జి.ఎస్.ఆర్. మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సహకారంతో నిర్మించిన బొమ్మిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వేదికను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని భవిష్యత్తులో రాణించాలన్నారు. రూ. 70 వేలతో దీన్ని నిర్మించినట్లు ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు బొమ్మిరెడ్డి మైథిలి తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, కార్యదర్శి వై.లక్ష్మి, ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు విష్ణువందన, స్కూల్ హెచ్‌ఎం మున్వీర్ బాషా, ఉపాధ్యాయులు బాషా, శశికళ, వెంకటసుబ్బయ్య, రొటేరియన్లు బి.సురేంద్రరెడ్డి, జానకిరామిరెడ్డి, దశరధరామిరెడ్డి, కె.మునిగిరీష్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 4లక్షల బంగారం స్వాధీనం

- డిఎస్పీ శ్రీనివాస్



గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్ తన కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ షుమారు 4 లక్షలు విలువ చేసే 20.5 సవర్ల బంగారాన్ని వన్నె వెంకటేశ్వర్లు అనే అతని నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతను పాత ముద్దాయి అని, మోటార్ సైకిల్‌లో తిరుగుతూ చైన్‌స్నాచింగ్ చేస్తుంటాడని, ఇతని తమ్ముడు బాబు పరారీలో వున్నట్లు తెలిపారు. ఇతనిని మన్నారుపోలూరు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకొన్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి మండలం పూడిగ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట సిఐ విజయకృష్ణ, ఎస్సై గంగాధర్, క్రైంపార్టీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గూడూరు డిఎస్పీ ఆఫీసు, దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్, ఓజిలి, మనుబోలు పోలీస్‌స్టేషన్లను బాగా అందంగా తయారు చేసినట్లు తెలిపారు. సబ్‌డివిజన్లలోని 20పోలీస్‌స్టేషన్లలో బాగు చేస్తామని తెలిపారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు కోరారు. గూడూరులో ఇటీవల పిఆర్టీయూ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న క్లస్టర్ పాఠశాలలను తాము స్వాగతిస్తామని, కానీ ప్రస్తుత పాఠశాలలకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. పాఠశాలల వేళల మార్పుల వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించగా సానుకూలంగా స్పందించారని, పరిశీలించి మార్పులు చేస్తామన్నారు. పురపాలక సంఘ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు నేటికీ సర్వీస్‌రూల్స్ లేవని, అంతేగాక బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పిఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరీ అప్పారావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్వీఎస్ శర్మ, నాయకులు నాగేంద్రకుమార్, వెంకటరాజు, రమణారెడ్డి, రవిచంద్ర, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సిద్దయ్య, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రాజు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రోత్సాహం అవసరం - ఆర్డీవో రవీందర్



కప్ అందుకుంటున్న స్వర్ణాంధ్ర భారతి జట్టు

క్రీడలు మరుగునపడకుండా ఉండేందుకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆర్డీవో రవీందర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ, గూడూరు క్రికెట్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలను క్రీడలవైపు మక్కువ చూపేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు తమ నైపుణ్యం చాటుకునేందుకు సంస్థలు, దాతలు కూడా చొరవచూపాలని చెప్పారు. స్వర్ణాంధ్ర భారతి జట్టు 16.5ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 101పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల ప్రతినిధులు రఘురామిరెడ్డి, జానకిరామిరెడ్డి, కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, నాగసూరు గోపాల్, రైల్వేమేనేజర్ కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనంలో కేలండర్ ఆవిష్కరణ



సీమాంధ్ర బి.సి. సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీమతి సావిత్రిబాయి పూలే 185వ జయంతి వేడుకలను గూడూరు రెండోపట్టణంలోని బాలికల బాలసదనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీమాంధ్ర బి.సి సంక్షేమసంఘం 2015కేలండర్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఐతా మల్లిఖార్జున గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కోట శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తోకలపూడి గంగాధరం, గూడూరుటౌన్ అధ్యక్షులు కృష్ణమాచారి, నియోజకవర్గ అధ్యక్షులు చెన్నుపల్లి ప్రభాకర్, గిరి, బాబు, మునిరత్నం, రవి, ప్రహల్లాద్, నిడిగంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఓర్పు, విజ్ఞతతో సమస్యలు సర్దుబాటు చేసికొన వలసి ఉంటుంది. దూరప్రయాణాలు నిర్ణయం కావడం, ఆత్మీయులను, బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. ఉపాధి పథకాలు సామాన్యంగా సాగి పోతుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు కలిగి తొలగడం, తద్వారా టెన్షన్‌గా ఉండటం జరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. అనుకున్న పనులను ధైర్యంగానే జరుపుకొంటారు. కుటుంబసభ్యులతో అరమరిక సఖ్యత సరిగా ఉండక పోవచ్చును. వ్యాపారవృద్ధి అవకాశాలు మరియు ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి జీవనము వారికి వ్యాపకం బాగుంటుంది. పెట్టుబడులు షేర్లపై లాభాలుంటాయి. బంధువులతో తగాదాలు రాకుండా చూడాలి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇతరుల వ్యవహారాలలోకి పోయి, ఇబ్బందులు పడే అవకాశం ఉన్నది. రావలసిన బాకీలపై వత్తిడి పెంచండి. ఖర్చులపై అదుపుండదు. బంధుమిత్రులకు బేధాభిప్రాయాలుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో తొందరపడవద్దు. ఆర్థిక ఇబ్బందులుంటాయి. బ్యాంకు ఋణాలు లభించగలవు. ఉద్యోగార్థుల క్రొత్త ప్రయత్నాలు వాయిదా పడతాయి. దూరప్రయాణాలు రద్దు కాగలవు.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. దూరప్రయాణాలు, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. వృత్తి పరంగా గౌరవప్రతిష్టలు, ఆదాయం బాగుంటుంది. వ్యాపార విస్తరణ, క్రొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సాగిస్తారు. వ్యాపారవర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 09.01.2015 నుండి**
**తేది. 15.01.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవి, మకరంలో బుధశుక్రులు, కుంభంలో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 14 బుధవారము భోగి పండుగ
తేది 15 గురువారము సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలము
తేది 16 శుక్రవారము కనుమ పండుగ

### పుష్య మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 09 | శుక్ర | చతుర్థి | సా॥గం.4.13ని॥ |
| తేది. 10 | శని | పంచమి | సా॥గం.6.25ని॥ |
| తేది. 11 | ఆది | షష్ఠి | రా॥గం.8.20ని॥ |
| తేది. 12 | సోమ | సప్తమి | రా॥గం.10.14ని॥ |
| తేది. 13 | మంగళ | అష్టమి | రా॥గం.11.43ని॥ |
| తేది. 14 | బుధ | నవమి | రా॥గం.12.37ని॥ |
| తేది. 15 | గురు | దశమి | రా॥గం.1.02ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సభలు సమావేశాలలోను, శుభకార్య నిర్ణయంలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఇతరుల పనులపై ప్రయాణాలుంటాయి. శుభవార్తలు వినడం జరుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. అనుకున్న పనులు సక్రమంగా జరుగుట, సమస్యలపై సంప్రదింపులు జరుపుట, రాజీ చేసికొనడం జరుగుతుంది. ఆదాయవృద్ధి కలదు. స్థిరాస్తుల మీద ఆదాయముంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. షేర్లు పెట్టుబడుల మీద ఆదాయం సంతృప్తికరంగా ఉండదు. అనుకున్న పనులకు పరిస్థితులు అనుకూలించి నెరవేరగలవు. మీ సలహాలు సూచనల వల్ల ఇతరులు లాభం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. సేవాకార్యాలకు సహాయ పడతారు. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత కలదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మాట తొందర తగ్గించుకుంటే అందరూ సహకరిస్తారు. పెట్టుబడులు షేర్ల మీద లాభాలుంటాయి. మీరు చేసే అన్ని ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలించగలవు. ఆర్థిక లావాదేవీలు, క్రొత్త వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనాలి. బాకీలు, ఇతరత్రా రావలసిన ఆదాయం పొందే అవకాశం ఉన్నది. కోర్టు కేసులు వాయిదా పడగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ బాధ్యతలందు అదనపు పనిభారం ఉంటుంది. ఉద్యోగులు పబ్లిక్‌తో జాగ్రత్తపడాలి. స్థిరాస్తుల క్రయ విక్రయాలపై ఆలోచనలు చర్చలుంటాయి. పెట్టుబడులు షేర్లపై లాభాలుంటాయి. అధికారులు ప్రలోభాలకు దూరంగా ఉండండి. రాబడికి తగ్గట్లు ఖర్చులు సర్దుబాటు చేసికొంటారు. వ్యాపారవర్గాలకు ఆర్థికావకాశాలు వాయిదాపడే స్థితి ఉన్నది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

షేర్లు పెట్టుబడులందు కొంత నిరుత్సాహం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు పొందగలరు. పనులు చేసేటప్పుడు ముందు వెనుకలు ఆలోచించి చేయండి. లేకుంటే విమర్శలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆర్థిక నిర్ణయాలలోను, పెట్టుబడులందు, వ్యాపార విస్తరణ విషయంలో ఇబ్బందులు రాకుండా చూచుకొనాలి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది. ఉద్యోగులకు పనిభారం, అధికారుల అజమాయిషీ ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి ఉద్యోగాలలో పురోగతి, గౌరవ ప్రతిష్టలు బాగుంటాయి. ఆర్థికస్థితి బాగుండి రాబడిపై సంతృప్తి ఉంటుంది. ఇంట బయట స్త్రీలకు పురుషులకు సమస్యలుంటాయి. లౌకికముగా పరిష్కరించుకొనడం మంచిది. సోదరులకు మేలు చేకూరుతుంది. ఆస్తి వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై దృష్టిపెడతారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అదనపు ఖర్చులు అనుకోకుండా పైనబడతాయి. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేసికొనడం మంచిది. క్రొత్త వ్యాపారాలు, ప్రాజెక్టులకు అవకాశాలు అనుమతులుంటాయి. వ్యాపారవర్గాలకు ఆదాయము బాగుంటుంది. వృత్తి పరంగా ఆటంకాలు తొలగి వ్యాపకం పెరుగుతుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. శుభకార్యం నిర్ణయం కాగలదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులు, కాంట్రాక్టులు, లీజు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందిపడతారు. వృత్తిపరంగా వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు వాయిదా పడవచ్చును. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు, ఇబ్బందులుండి సర్దుబాటు కాగలవు. అనుకున్న పనులు జరగడానికి శ్రమపడాల్సి వుంటుంది.

# భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్‌నబీ



మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నెల్లూరు నగరంలో ముస్లిం సోదరులు ఆదివారం రాత్రి జులుస్ నిర్వహించారు. ఒంటెలు, గుర్రాల మీద జెండాలు చేతపట్టుకుని కామాటివీధి మసీదు వీధి నుంచి ప్రదర్శన నిర్వహించారు. అక్కడనుంచి కోటమిట్టకు చేరుకుని డైకస్‌రోడ్డు, మద్రాసుబస్టాండు, విఆర్‌సి సెంటర్, గాంధీబొమ్మ, కాపువీధి, ములుమూడిబస్టాండ్ మీదుగా కామాటివీధి మసీదు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సూచించిన శాంతిమార్గంలో ప్రతిఒక్కరు నడుచుకోవాలన్నారు. ప్రతిఒక్కరు ఐకమత్యంతో ఒకరికొకరికి సహాయసహకారాలు అందించుకోవాలని ప్రవక్త సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబ్దుల్ జలీల్, ఖలీల్, సమి, నౌషాద్, ఖలీద్, దస్తగిరి, సుబాన్, ఏజాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ముస్లింయూత్ బిస్కెట్లు




నెల్లూరుజిల్లా ముస్లిం సేవా కమిటి ఆధ్వర్యంలో రబ్బీవుల్ అవ్వల్ ప్రవక్త జన్మించిన మాసం ప్రారంభం సందర్భంగా ఇటీవల కోటమిట్ట షాదిమంజిల్ ప్రక్కన వున్న తెలుగు పాఠశాలలోని విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు.

మిలాదున్‌నబీ సందర్భంగా ఆదివారం కామాటివీధి అయిషా మసీదు నుండి గొప్ప ర్యాలీ జరిగిందని, ముస్లిం సేవా కమిటి అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్ పేర్కొన్నారు. ఈ మాసంలో రబ్బీవుల్ అవ్వల్ పేరు మీద సేవ చేయాలని అల్లా చెప్పారని, సేవద్వారానే పుణ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అక్రమ్, మున్నా, ఎజాజ్, ఇస్సాక్, మునవర్, సుభాహని, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టంగా ప్రభుత్వ పథకాలు

**- జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అన్నారు.

సోమవారం కలెక్టరేట్‌లో వివిధ మండలాల టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయాలన్నారు. వాటి నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. డంపింగ్‌యార్డ్‌లకు అనువైన ప్రదేశాలను గుర్తించి తగు నివేదికలు పంపాలన్నారు. ఋణవిముక్తి పొందిన రైతుల వివరాలను మండలాల వారీగా సేకరించి కార్యాలయానికి పంపించాలన్నారు. రేషన్‌కార్డు, గ్యాస్, పట్టాదారు పాస్‌పుస్తకాలకు సంబంధించిన ఆధార్ సీడింగ్‌ను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెసి రాజ్‌కుమార్, డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి, ఐటిడిఏ పిఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సిఇఓ ఎం.జితేంద్ర, వ్యవసాయశాఖ జె.డి సుబ్బారావు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, డిఎస్‌ఓ సంధ్యారాణి, బిసి కార్పొరేషన్ ఇ.డి కోటేశ్వరరావు, డి.ఎం ధర్మారెడ్డి, ఉద్యానశాఖ ఏ.డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయురాలు.. సావిత్రిబాయి పూలే



బాలికా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని, ఆమె సమాజానికి మహోన్నతసేవలు అందించారని వక్తలు ప్రశంసించారు.

ఈ నెల 3న సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా, పలు సంఘాల నాయకులు నెల్లూరులోని మినీ బైపాస్‌రోడ్డులో వున్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు డి.మాల్యాద్రి, ఆది నారాయణ మాట్లాడుతూ దేశంలో తొలి ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయిపూలే ఖ్యాతిని అందుకున్నారని అన్నారు. సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలన్నారు. బిటిఎ నాయకులు ఎన్.రమణయ్య, ఎల్.ఫెర్డినాండ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అదేవిధంగా, దళితసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు జక్కా రమణయ్య, సిహెచ్ దళితబాబు, దాసరి విజయకుమార్ తదితరులు, దళిత విద్యార్థి సేన నాయకులు అరవపూర్ణప్రకాష్ ఆధ్వర్యంలో మరికొందరు సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**మహారాజశ్రీ ఏలూరు 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా**

**ఐ.ఎ.నెం. 767/2014 ఓ.ఎస్.నెం.88/2014**

Between
Vijetha Lunani,
Rep. by Special Power of Attorney,
Harigopal Lunani ....Petitioner (Plaintiff)
And
Katamreddy Vamsi Krishna Reddy
... Respondent (Defendant)

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంట్ అయిన కాటంరెడ్డి వంశీకృష్ణా రెడ్డి, తండ్రి: లేటు శ్రీనివాసులు రెడ్డి, కల్లూరుపల్లి గ్రామము, నెల్లూరు-524005 అనువారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ, పుచ్చుకొననందున Substitute Service గా ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచూ వాయిదా 30-01-2015వ తేదీకి వేసినారు. కావున వాయిదా రోజున స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి, తగు సంజాయిషీ ఇవ్వవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

**DAMARAJU NARASIMHA RAO**,
Advocate, Flat No.1B,
Sri Raj Jayalakshmi Apartments,
Allasani Peddana Street, Ashok Nagar,
Eluru – 534002. Ph: 9494327394

**మహారాజశ్రీ ఏలూరు 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా**

**ఓ.ఎస్.నెం.88/2014**

Between
Vijetha Lunani,
Rep. by Special Power of Attorney,
Harigopal Lunani ....Plaintiff
And
Katamreddy Vamsi Krishna Reddy
....Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన కాటంరెడ్డి వంశీకృష్ణారెడ్డి, తండ్రి: లేటు శ్రీనివాసులురెడ్డి, కల్లూరుపల్లి గ్రామము, నెల్లూరు-524005 అనువారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ, పుచ్చుకొననందున Substitute Serviceగా ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేయుచూ వాయిదా 30-01-2015వ తేదీకి వేసినారు. కావున వాయిదా రోజున స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి, తగు సంజాయిషీ ఇవ్వవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

**DAMARAJU NARASIMHA RAO**,
Advocate, Flat No.1B,
Sri Raj Jayalakshmi Apartments,
Allasani Peddana Street, Ashok Nagar,
Eluru – 534002. Ph: 9494327394


## సంక్రాంతి లక్ష్మి



మరలె చక్రాలు శుభమీయ మకరమునకు
తరలి వచ్చెను సంక్రాంతి వరములీయ
దోయిలించిన హృదినుండి పూవులొచ్చు
జాలువారెను ఆకాంక్ష జల్లువోలే!
పసుపు గడపలు బారులై ప్రణతులొసగ
పచ్చతోరణమింటింట ప్రభలు జిమ్మె
హెచ్చె స్వాగత సంరంభ హేల నేడు
రమ్ము సంక్రాంతి లక్ష్మి రాగమొసగ!
కన్నెపిల్లల గొబ్బిళ్ళు కలకలములు
మేలుకొలుపు పాటలో మేళతతులు
గంగిరెద్దులు సన్నాయి హంగు మీర
రమ్ము సంక్రాంతి లక్ష్మి రాగమలర!
గడప ముందట కలయంపి కళలు నిండె
బంతి చేమంతి హేమంత వింత చూపె
బాలభానుడు మకరాన పాదముంచె
రమ్ము సంక్రాంతి లక్ష్మి రాగమొసగ!

- కె.వి నాగేశ్వరరావు (కోవూరు)

# మంత్రి బొజ్జలకు పితృవియోగం



బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి

అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తండ్రి మాజీఎమ్మెల్యే బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి(95) బుధవారం స్వగ్రామమైన శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని తన నివాసంలో కన్నుమూశారు.

ఊరందూరు గ్రామంలో 1920 మే14వ తేదిన బొజ్జల గంగిరెడ్డి, పోలమ్మ దంపతులకు బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు , మొదటి కుమారుడు బొజ్జల హరినాథరెడ్డి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రెండో కుమారుడు. 1957లో బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి ఊరందూరు గ్రామ కమిటీ చైర్మన్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి, నీలకంఠేశ్వరస్వామి, ఆలయాలకు పదేళ్లపాటు చైర్మన్‌గా పనిచేశారు. 1964లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్‌గా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి, అప్పటి విద్యాశాఖ మంత్రి అద్దూరు బలరామిరెడ్డిపై విజయం సాధించారు. కాగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పలువురు మంత్రులు, వివిధ పార్టీల నాయకులు గంగసుబ్బరామిరెడ్డి మృతికి సంతాపం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పేట రాధారెడ్డి, వైస్ చైర్మన్ పార్థసారధి, పోతుగుంట గురవయ్యనాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, కొండుగారి శ్రీరామ్మూర్తి, వై.ఎస్.ఆర్.సి.పి. శ్రీకాళహస్తి సమన్వయ కర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అంజూరు శ్రీనివాసులు, కౌన్సిలర్లు బాలకృష్ణయ్య, మిద్దెల హరి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి ఊరందూరుకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## జేసీఐ నూతన కమిటీ

నెల్లూరు జేసీఐ నగర నూతన కమిటీ ఆదివారం స్టోన్‌హౌస్‌పేటలోని జేసీఐ భవన్‌లో ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా ఎం.సతీష్‌కుమార్, కార్యదర్శిగా కె.చరణ్‌కుమార్, కోశాధికారిగా మస్తాన్ రావులు ప్రమాణం చేశారు.

# విపక్షాలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయం గురించి గట్టిగా చెప్పే బీజేపీ వాళ్లు కూడా తెలుగుదేశంతో వున్న పొత్తు పుణ్యమా అని ఈ పచ్చటి పొలాలను రాజధానిపేరుతో నాశనం చేసే ప్రక్రియను ప్రశ్నించలేకపోతున్నారు. ప్రధాన ప్రతిపక్షం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కూడా రాజధాని భూముల విషయంలో పూర్తిస్థాయిలో పోరాడలేకపోతోంది. దీనికి కారణం రాజధాని భూములపై పోరాడితే కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వ్యతిరేకత వస్తుందనే భయమే కావచ్చు. ఈ పోరాటంలో వైకాపా ఒక్కటే చాలదు. పోరాటాలలో ముందుండే సిపిఎం, సిపిఐలను కూడా ఆ పార్టీ కలుపుకోవాలి. కాని ఆ ప్రయత్నం జరగడం లేదు. రాజధాని భూములపై వామపక్షాలు కూడా ఎవరి దారిలో వాళ్లు ఒంటరిగా పోరాడుతున్నారు. అంతేగాని కనీసం వాళ్లిద్దరు కలిసి పోరాడడం లేదు. రాజధాని భూములే కాదు, ఋణమాఫీ, పింఛన్‌లు వంటి సమస్యలున్నాయి. ఏ జిల్లాలోనూ అభివృద్ధి పనులు లేవు. ఈ సమస్యలన్నింటి మీద విపక్షాలు ఒకే వేదికపైకొచ్చి పోరాటం చేయాలి. ఈ పార్టీల్లో ఆ స్ఫూర్తి లేదుకాబట్టే ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో మూర్ఖంగా ముందుకు పోగలుగుతోంది.

# జేసీగా ఇంతియాజ్

(మొదటిపేజీ తరువాయి)

అయ్యింది. 2014 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె గత ఏడాది ఫిబ్రవరి 22న జిల్లా జేసీగా వచ్చారు. అప్పుడే ఎన్నికల సీజన్ మొదలుకావడంతో జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి ఆమె గట్టిగా కృషి చేశారు. ఓటర్లలో చైతన్యం తేవడానికి సంగీతకచేరీలు పెట్టించారు. ముఖ్యంగా ప్రపంచమంతా క్రికెట్ దేవుడిగా ఆరాధించే మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను నెల్లూరుజిల్లాలోని పుట్టంరాజుకండ్రిగ అనే గ్రామానికి తీసుకొచ్చి, ఆ గ్రామాన్ని సచిన్ దత్తత తీసుకునేలా చేయడంలో రేఖారాణి పాత్ర విస్మరించలేనిది. అలాగే కార్తీకపౌర్ణమికి మైపాడుబీచ్‌లో చేసిన ఏర్పాట్లు, ఈ ఏడాది పక్షులపండుగను ఆర్భాటంగా నిర్వహించడానికి ప్రయత్నాలు చేశారు. ఆమె పక్షుల పండుగ ఏర్పాట్లలో ఉండగానే బదిలీ జరిగిపోయింది.

ఆమె స్థానంలో వచ్చిన ఇంతియాజ్‌కు నెల్లూరేమీ కొత్త కాదు. కర్నూలుజిల్లాకు చెందిన ఆయన 2010ఆగష్టు నుండి 2014 జనవరి వరకు నెల్లూరులో వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. 2014లో ఐఎఎస్ హోదా వచ్చాక ఈ జిల్లాలోనే ట్రైనీకలెక్టర్‌గా శిక్షణ పొందారు. పనిచేయడానికి ఎంతో ఇష్టపడే నెల్లూరుజిల్లాకే జాయింట్ కలెక్టర్‌గా వచ్చారు. నెల్లూరీయులతో ఎంతో సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి వ్యక్తిగా, అందరితో కలుపుగోలుగా వుండే మనిషిగా పేరుంది. నెల్లూరు జేసీగా బాధ్యతలు చేపడుతున్న ఇంతియాజ్‌కు 'లాయర్' అభినందనలు.

# తొలి దెబ్బ పడింది

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాడు. రాజకీయ నాయకుల మాట చెల్లుబాటు కావడం లేదు. సిఫార్సులు పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలపై వేటుకు ఏ మాత్రం వెనుకాడడం లేదు. ఈ క్రమంలోనే దురాక్రమణలపై నెల్లూరులో తొలివేటు పడింది. అన్నమయ్య సర్కిల్‌లో మినీబైపాస్ మరియు గొలగమూడి కూడలిరోడ్డులో వున్న భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని కొంత భాగాన్ని మంగళవారం కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం నుండి తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా ఈ భవన నిర్మాణం చేపట్టారు. అదీగాక కొండాయపాలెంరోడ్డు ఇక్కడ 40అడుగులే వుంది. మాస్టర్‌ప్లాన్‌ను ఇక్కడ కొంతదూరం మాత్రమే 40అడుగులుంది, ఇస్కాన్ మందిరం నుండి 60అడుగులు వుంది. దీనిపై గత కొన్నిరోజులుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోరాడుతున్నారు. అంటే కొండాయపాలెంరోడ్డులో ఈ భవనం 10అడుగులు ముందుకొచ్చినట్లయ్యింది. దీనిపై స్థానికులు హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు దీనిని విచారించి నిబంధనలు ఉల్లంఘించిన ఈ భవనాన్ని కూల్చివేయాలని నెల్లూరు నగరపాలక సంస్థను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో కదిలిన కార్పొరేషన్ యంత్రాంగం ఈ నెల 6వ తేదిన జేసీబీలు, డ్రిల్లింగ్ మిషన్‌లు, సిబ్బందితో వెళ్లి, పోలీసుభద్రతతో ఆ భవనాన్ని పగలగొట్టారు. నెల్లూరులో అక్రమనిర్మాణాలపై వేటుకు ఇది శాంపిల్ మాత్రమే. నెల్లూరు నిండా ఇలాంటివి చాలా ఉన్నాయి. అసలు అప్రూవల్ లేకుండానే మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆక్రమించి కట్టిన అనిల్‌గార్డెన్స్ వ్యవహారం ఎప్పటి నుండో పెండింగ్‌లో వుంది. అనిల్‌గార్డెన్స్ యాజమాన్యానికి నోటీసు ఇచ్చి కూల్చి వేయమని హైకోర్టు ఎప్పుడో ఆదేశించినా కార్పొరేషన్ యంత్రాంగం ఇంతవరకు పట్టించుకోలేదు. మాస్టర్‌ప్లాన్ రోడ్డు, మాస్టర్‌ప్లాన్‌లో రిజర్వ్‌స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ఏ బిల్డింగ్‌కు సరైన ప్లాన్ ఉండదు. ఇచ్చిన ప్లాన్‌కు కట్టిన భవనానికి ఎలాంటి సంబంధం ఉండదు. కనీసం కార్పొరేషన్ కొట్టిన తొలి దెబ్బతోనైనా నిర్మాణదారుల్లో మార్పు రావాలి.

# తిరగబడుతున్న బోర్డు...

(5వ పేజీ తరువాయి)

బాండ్లను తీసుకోవడం లేదు. వారికి నగదు చెల్లింపులు లేవు. దీంతో బాధితులందరూ ఆందోళనకు దిగారు. నెల్లూరుజిల్లాలోనే 50కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించినట్లు సమాచారం. బాధితులకు చెల్లింపులు 80కోట్ల దాకా ఉన్నట్లు భోగట్టా. బృందావనంలోని అగ్రిగోల్డ్ కార్యాలయం ఎదుట ప్రతిరోజూ బాధితులు ఆందోళనలు నిర్వహిస్తూనే వున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో ఒత్తిడికి గురై అగ్రిగోల్డ్‌లో పనిచేసే ఉద్యోగి ఒకరు ఇటీవల మరణించారు. 'అగ్రిగోల్డ్'పై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నెల్లూరు పోలీసులు ఆ సంస్థ కార్యాలయంపై దాడి చేశారు. సోదాలు నిర్వహించారు. మొత్తం కేసు ఇప్పుడు పోలీసుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

నెల్లూరుజిల్లాలో సంచలనం రేపిన మనీస్కీం ఇంకా ఓ కొలిక్కిరాలేదు. మనీస్కీం పేరుతో పలు కంపెనీలు బీదా బిక్కి జనం నుండి వందకోట్లకు పైగా దండి బిచాణా ఎత్తేసాయి. పోలీసులు ఈ సంస్థల నుండి కొంత సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించారు. దొరికిన సొమ్ము ఏమైందో, విచారణ ఎక్కడి దాకా వచ్చిందో ఇంతవరకు తెలీదు. మనీస్కీం బాధితులకు మాత్రం ఇంతవరకు తిరిగి ఒక్కరూపాయి కూడా చేరలేదు.

ప్రైవేట్ ఫైనాన్స్ మోసాలకు కళ్లెం వేసేదిగా ప్రభుత్వాలు, ఆర్‌బిఐ చొరవ చూపాలి. ఎలాంటి గ్యారంటీ లేకుండా ప్రజల నుండి డిపాజిట్లు సేకరించే ఫైనాన్స్ కంపెనీలను మూసివేసే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

# ఎంత ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఘటనలో మరో 40మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతుండగా, వీరిలో 13మంది పరిస్థితి విషమంగానే వుంది. మృతి చెందినవారిలో 12 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు వుండడంతో, బిడ్డలను కోల్పోయిన వారి తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతంగా వుంది. స్కూలుకు వెళ్ళాల్సిన పిల్లలు, శవాలై తిరిగి రావడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల వేదనారోదనలతో ఆ ప్రాంతమంతా శోకమయమైంది.

అనంతపురం జిల్లా పెనుకొండ వద్ద క్రిక్కిరిసిన ప్రయాణీకులతో వెళ్తున్న ఆర్టీసి పల్లెవెలుగు బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే వున్న గోతిలో పడిపోయింది. సుమారు 60 అడుగుల ఎత్తునుంచి బస్సు పల్టీలు కొడుతూ ఆ లోయలో పడిపోవడంతో బస్సు నుజ్జునుజ్జయిపోయింది. బస్సులో వున్న అనేకమంది తీవ్ర గాయాల పాలుకాగా, పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో అయిదు నిమిషాల్లోనే బస్సు పెనుకొండకు చేరుకుంటుందనగా, ముందు వెళ్తున్న ఆటోను దాటివెళ్లే ప్రయత్నంలో అదుపుతప్పి ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఒక్కరోజు దాటితే మరో రెండు రోజుల్లో సంక్రాంతి సెలవులు వస్తాయని, విద్యార్థులంతా సంతోషంగా ముచ్చటించుకుంటున్న సమయంలోనే, బస్సు వేగంగా వెళ్ళి గోతిలో పడిపోయింది. మరొక్క నిమిషం పాటు బస్సు సజావుగా వెళ్ళినా, ఆ ఘాట్ రోడ్డు దాటివుండేది. ఆ తర్వాత ఎక్కడా లోయ వంటి ప్రదేశం లేదు. అయినా, విధి వక్రించి కనురెప్పపాటులోనే ఈ ఘోరం జరిగిపోయింది. చెల్లాచెదురైన మృతదేహాలు, బాధితుల ఆర్తనాదాలు.. హాహాకారాలతో ఆ ప్రాంతమంతా మృత్యు ఘోషతో దద్దరిల్లిపోయింది. ఈ ప్రమాదంలో మావటూరు గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంతో, ఆ గ్రామమంతా శోకసాగరంలో మునిగిపోయింది. పండుగ రోజుల్లో ఈ విషాద సంఘటన ప్రజలను కంటతడిపెట్టించింది. బస్సు బోల్తాపడిన తీరు దృశ్యాలు చూసి ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందివుంటాడని తొలుత భావించినా, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో వున్న అతని పరిస్థితి విషమంగా వున్నట్లు తెలుస్తోంది. కాగా, ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. గవర్నర్ నరసింహన్ ఈ సంఘటన పట్ల విచారం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.5లక్షలు, తీవ్రగాయాల పాలైన వారికి రూ.2 లక్షలు, గాయాలతో బాధపడుతున్నవారికి రూ.లక్ష వంతున ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని హోంమంత్రి చినరాజప్ప అధికారులను ఆదేశించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, శిద్దా రాఘవరావులు సంఘటనాస్థలానికి వెళ్ళి బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. కాగా, డ్రైవర్ నిర్లక్ష్యం, కండిషన్‌లో లేని బస్సు, ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం వల్లనే బస్సు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ చేయించాలని పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. మృతులందరూ పేద కుటుంబాలవారేనని, ఆయా కుటుంబాల వారికి రూ.10లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. రోడ్డుపై కనీసం రక్షణ గోడ లేకుండా నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. ఇదిలావుంటే, ఈ సంఘటన సమాచారం తెలిసిన వెంటనే ప్రతిపక్ష నేత, వైఎస్సార్సీపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్ళారు. అక్కడికి వెళ్ళి బాధితులను పరామర్శించారు. బస్సు ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆయన విమర్శించారు. మృతుల కుటుంబాలకు పాతిక లక్షల రూపాయల పరిహారం అందివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ ప్రమాద ఘటనపై వామపక్ష నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా రవాణాశాఖ పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఈ దుర్ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం నేత మధు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# అరేబియా తీరంలో నెల్లూరు చెత్త

శ్రీను గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు మహానగరం. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అబ్దుల్ అజీజ్ ఛాంబర్. ఎప్పటిలాగే ఆయన తన ఛాంబర్‌కు వచ్చాడు. ఎప్పటిలాగే నెల్లూరును ఎలా అభివృద్ధి చేయాలనేదానిపై మూడుగంటలు ఆలోచించాడు. తర్వాత ఇంటికి బయలుదేరాడు. ఆయన ఇంటికి పోయే మార్గంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, పందుల మందలు, కుక్కల గుంపులు కనిపించసాగాయి. సార్క్ దేశాలన్నీ కలిసొచ్చి సహకరిస్తేగాని నెల్లూరులో ఉండే ఈ చెత్తనంతా ఎత్తేయలేమేమో అని ఆయన మనసులోనే అనుకున్నాడు. అలా అనుకుంటూనే ఇంటికెళ్లి స్నానం చేసి, భోజనం చేసి పడుకున్నాడు.

★★★★★

తెల్లారింది. అజీజ్ స్నానం చేసి రెడీ అయ్యి బయటకొచ్చి కారులో కార్పొరేషన్ ఆఫీసుకు బయలుదేరాడు. రోడ్డు పక్కన కనిపిస్తున్న దృశ్యాలను చూసి ఆయన షాక్‌కు గురయ్యాడు. ఎక్కడా కొండలను తలపించే చెత్తదిబ్బలు లేవు. పందుల మందలు, కుక్కల గుంపులు అసలు కనిపించడం లేదు. కార్పొరేషన్ కార్యాలయం దాకా వెళ్లాడు. ఎక్కడ చూసినా అదే పరిస్థితి. కార్పొరేషన్ కార్యాలయం వద్ద అయితే వందల సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది పోగై వున్నారు. వాళ్లంతా కూడా ఆందోళన చేస్తున్నారు. అజీజ్ వెళ్లి... ఏమైందని వారి నాయకుడిని అడిగాడు. ఆ నాయకుడు వుండి... రాత్రికి రాత్రే నెల్లూరులో చెత్తను ఎవరో ఎత్తుకెళ్లారు. పందులు, కుక్కలు లేవు... చెత్తా చెదారం లేక పోవడంతో మన నెల్లూరు బ్రాండ్ ముదురుదోమలు కూడా కనిపించడం లేదు. వీటిని నమ్ముకునే మేం నెల్లూరులో ఉద్యోగాలు చేస్తున్నాం... అవి లేకుంటే పని లేదని చెప్పి మా ఉద్యోగాలు ఊడబెరుకుతారు. అంతెందుకు చెత్త ట్రాక్టర్లు కూడా మూలనపడి, డ్రైవర్లకు పనిలేకుండాపోతుంది. నెల్లూరులో చెత్త లేకుండా పోతుంది. నెల్లూరులో చెత్త లేకుండా చేసి నగరాన్ని ఇంత గలీజుగా మార్చిన వారిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు కూడా ఆయనకు వత్తాసు పలికారు. అజీజ్ వారికి మద్దతు పలుకుతూ... దీనిని నేను కూడా ఖండిస్తున్నాను. అసలు నాకు తెలియకుండానే చెత్త పోవడమేంటి... పందులు, కుక్కలు పోవడమేంటి... ఈరోజు అవే పోయాయి... మనం కామ్‌గా ఉంటే రేపు డంపింగ్‌యార్డ్‌ను కూడా తీసుకుపోతారు. కాబట్టి దీనిపై జరిగే ఆందోళనలో నేనూ పాలు పంచుకుంటాను... మనం వెంటనే ఎస్పీ సెంథిల్‌కుమార్ గారిని కలిసి దీనిపై ఫిర్యాదు చేద్దామని చెప్పాడు. అందరూ అలాగేనన్నారు. ఇందుకు ఎమ్మెల్యేలను కూడా తీసుకుపోదామని చెప్పి అజీజ్ ముందుగా మాటల మిస్సైల్ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. అజీజ్ చెప్పింది వినగానే కోటంరెడ్డి... మాయాబజార్ సినిమాలో ఎస్వీ రంగారావు లెవల్లో నవ్వాడు. అజీజ్ భాయ్... దీని వెనుక చాలా కథ నడిచింది. రాత్రికి రాత్రే ఉన్నతస్థాయిలో పని జరిగింది. విషయం చెబుదామని నీకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ చేసి వుంది. మేమంతా అర్ధరాత్రి వీరులం కాబట్టి ఈ ఆపరేషన్‌లో పాల్గొనగలిగామని అన్నాడు. అజీజ్‌కు ఏమీ అర్థం కాక... ఉన్నతస్థాయి సమావేశాలేంటి... అర్ధరాత్రి ఆపరేషన్‌లేంటి.. నాకేం అర్థం కావడం లేదన్నాడు. అప్పుడు కోటంరెడ్డి నేనే వచ్చి నీకు వివరంగా చెబుతానంటూ మేయర్ ఆఫీసుకే వెళ్లాడు. కోటంరెడ్డి, అజీజ్ ముందు వేళ్లతోనే స్క్రీన్ గీసి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

న్యూఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రులు మనోహర్ పారికల్, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, వెంకయ్యనాయుడులు సమావేశమయ్యారు. మోడీ వుండి... అరేబియా సముద్రంలో పాకిస్థాన్ పడవను మన భద్రతాదళాలు అడ్డుకోబట్టి సరిపోయింది, లేకుంటే మరో 26/11 దుర్ఘటన పునరావృతమై ఉండేది. ఇటువంటి ప్రమాదం మళ్ళీ మళ్ళీ రాకూడదు. మన తీరం వైపు పాకిస్థాన్ తీవ్రవాదులు కన్నెత్తి చూడాలంటేనే భయపడేటట్లుండాలి. ఒకవేళ ఆరేబియా తీరంలో ఏ ఉగ్రవాదన్నా అడుగుపెట్టినా తిరిగి పోకూడదు. ఏం చేయాలో మీరే చెప్పండి అని మోడీ కోరాడు. వెంటనే వెంకయ్య స్పందించాడు. తన సెల్ తీసి టకాటకా కొందరికి ఫోన్‌లు చేసి వెంటనే ఢిల్లీకి రమ్మని చెప్పాడు.

★★★★★

ప్రధాని నివాసంలో మోడీ, కేంద్రమంత్రులున్నారు. వారితో పాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్, నెల్లూరు కలెక్టర్ ఎం.జానకి, కమిషనర్ చక్రధర్‌బాబు, మాజీఎమ్మెల్యే, స్టైల్ ఆఫ్ సింహపురి వివేకానందరెడ్డి ఉన్నారు. వెంకయ్య నాయుడు వారికి సమస్యను వివరించి... ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపడంలో మీరు ఎక్స్‌పర్ట్స్. అందుకే మిమ్మల్ని స్పెషల్‌గా పిలిపించాను, ఏం చేయాలో చెప్పండని కోరాడు. అప్పుడు వివేకా... ఏం చేయాలనేదానిపై మాస్టర్‌ప్లాన్ చెప్పాడు. నెల్లూరులోని అన్ని వీధుల్లో వుండే టన్నులకొద్దీ చెత్తను, వేల సంఖ్యలో వున్న పందులు, కుక్కలను స్పెషల్ ఫ్లైట్లలో తీసుకొచ్చి అరేబియాసముద్ర తీరంలో వదలాలి. ఆ చెత్తతో పాటు ముదురు దోమలు కూడా వస్తాయి. తీరంలో అవే పెద్ద సైన్యంగా పహారా కాస్తాయి. ఉగ్రవాదులు దగ్గరగా వచ్చారా... ఇవి దాడిచేసి వెనక్కి తరుముతాయి. ఖర్మకాలి ఇక్కడ అడుగుపెట్టారా కరచికరచి చంపుతాయని వివేకా చెప్పాడు. పెద్దఖర్చు లేకుండా ఉగ్రవాదులను నిరోధించే ప్లాన్ చెప్పినందుకు నెల్లూరు నాయకులను మోడీతో పాటు కేంద్ర మంత్రులు కూడా అభినందించారు.

ఇక్కడితో కోటంరెడ్డి ఫ్లాష్‌బ్యాక్ ఆపేసి... రాత్రి అలా జరిగింది భాయ్... నిన్న అలా మాట్లాడుకున్నామో లేదో రాత్రే కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వచ్చిన బలగాలు నెల్లూరులోని చెత్తను, పందులనంతా స్పెషల్ ఫ్లైట్‌లో అరేబియా సముద్రం వద్దకు తీసుకెళ్లాయి. అయినా కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు, ఈ చెత్తను ఎత్తేయాలంటే మనవల్ల ఎక్కడవుతుంది చెప్పండి. పైసా ఖర్చు లేకుండా పనైపోయింది కదా అని అన్నాడు. అప్పటికి కూడా అజీజ్ అసంతృప్తిగా... ఏదైనా నన్నూ ఈ ఆపరేషన్‌లో ఇన్‌వాల్వ్ చేసుంటే బాగుండేదన్నాడు. ఈసారి అవకాశమొస్తే మీకు ఖచ్చితంగా ఇన్‌ఫార్మ్ చేస్తామంటూ కోటంరెడ్డి అక్కడనుండి లేచాడు.

## కదంబం

### నువ్వు అన్నీ మరచిపోయావు

- ఖాదర్ షరీఫ్. షేక్
సోమశిల. 9441938140

రాత్రి ఒకానొక జీవన సౌందర్యపు శిఖలోంచి
నీవు పట్టుకున్న చిటికెనవేలుని జారవిడిచాక
ఉష్ణరెప్పలలో దాగిన జ్ఞాపకాలన్నింటినీ
ఒడ్డున నుల్చుని సముద్రంలోకి గిరాటు వేశాక
ఎంతకీ తెగని కలని ఆత్మభరిణలో నానబెట్టుకుని
కర్కశంగా నీకు నీవే తెగొట్టుకున్న కలల్నీ
మేఘరాత్రుల మనోహర సౌందర్యాన్నీ
అరణ్యానికి కానుకగా సమర్పించినపుడు
నీవు స్తన్యాన్ని త్యగించిన శిశువుకి మల్లే
వర్షపు అగ్నిశిఖలోకి ప్రవేశించావు

నీకు గుర్తులేదు నువ్వన్నీ మర్చిపోయావు

నీవు శిథిలాలకి దగ్గరగా చేరి
జీవితానికి జోలపాడుకునే సాహసానికి
నిర్భయంగా శ్రీకారం చుట్టుకున్నప్పుడు
కన్నీటికి ఆధారమయిన నేత్రాలు రెండూ
నీ జీవనదృశ్యాన్ని వాంతిచేస్కున్నాయి... కానీ
ఆ రాత్రిని పహారా కాసిందెవరో
తేల్చుకోలేని సంధిగ్ధంలోకి నీవెళ్ళిపోయావు

అప్పుడే ఆవిడొచ్చింది... కానీ
నీవేదో వియోగనిర్మాణంలో ఉన్నావు

నీకు గుర్తు లేదు... నువ్వన్నీ మర్చిపోయావు.

స్వర్గం ఎక్కడుందని ఆవిడ అడిగినప్పుడు
పిచ్చివాడికి మల్లే ఆకాశానికేసి చూశావు
ప్రేమని గురించి ప్రశ్నించినపుడు
జవాబులేక... మాటలు రాక
మూగవాడివైపోయావు
గత జన్మ జ్ఞాపకాన్నేదో నీ చేతుల్లో ఉంచి
నిన్ను ఆరాధనగా చూస్తున్నప్పుడు
ప్రేమలేని తనంతో దాన్ని ముక్కలు చేసుకున్నావు
నీ కోసం కంటిమీద రెప్ప పడనివ్వకుండా
చెట్టు పువ్వుల్ని రాల్చినంత స్వచ్ఛంగా
నీ కోసం దుఖపు పూలని రాల్చుకుని తిరిగినపుడు
ఆ... ఆవిడ కాకుంటే... మరొక్కత్తి అన్నావు నీవు

నీకు గుర్తు లేదు...
నువ్వు జీవితాన్నే మర్చిపోయావు

నువ్వేదో అనుకుంటున్నావ్ గానీ...
ఎవరు కట్టిన గదిగోడల్ని
వాళ్ళకైవాళ్లు స్పర్శించినంత ఆప్యాయంగా
మరింకెవ్వరూ స్పర్శించలేరు కదా...

## కె.వి.నాగేశ్వరరావుకు
# ఎక్స్‌రే ఉత్తమ కవి అవార్డు




విజయవాడకు చెందిన 'ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ' నిర్వహించిన 2014 జాతీయస్థాయి కవితల పోటీల్లో నెల్లూరుజిల్లాకు చెందిన సాహితీవేత్త, రచయిత, ప్రముఖకవి కె.వి.నాగేశ్వరరావు రచించిన 'సందిగ్ధ సమయం' కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది.

ఈ సందర్భంగా ఎక్స్‌రే సంస్థ 2014 ఉత్తమ కవితా అవార్డు ప్రదానోత్సవాన్ని విజయవాడ గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ హాల్‌లో గత నెల 25వ తేదీ ఘనంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.విజయబాబు, గుడివాడ ఆర్‌డిఓ సోమేపల్లి వెంకటసుబ్బయ్య నాగేశ్వరరావుకు ఉత్తమ కవితా పురస్కారం ప్రదానం చేసి, జ్ఞాపిక, నగదుతో సత్కరించారు. కార్యక్రమంలో ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి, న్యాయనిర్ణేత సాహితీవేత్త డా॥ అంపశయ్య నవీన్, రాయవరపు సత్యభామ, అంబటి మధుమోహనకృష్ణ, దేవినేని కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

విడవలూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా జరిగాయి. ఆరుద్ర నక్షత్ర ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి క్షీర పంచామృతసహిత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వ కల్యాణ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## విశ్వజనని బాలల సేవాసదన్‌కు
# ఆటోమొబైల్ డీలర్స్ వితరణ

నెల్లూరుజిల్లా నార్త్‌రాజుపాళెంలోని విశ్వజనని బాలల సేవాసదన్ (అనాథ శరణాలయం)లోని చిన్నపిల్లలకు ది నెల్లూరు ఆటోమొబైల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎడ్యుకేషన్ కమిటి ఛైర్మెన్ ఏ.హరిప్రసాద్ తండ్రి సంస్మరణార్థం బియ్యం, పప్పుదినుసులు పంపిణీ చేసినట్లు కార్యదర్శి పి.వి.సత్యనారాయణ తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులైన సాగర్, శ్రీలక్ష్మిలకు సంఘ అధ్యక్షులు కె.రామ్మూర్తి ద్వారా అందజేసినట్లు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో 'శివ ముక్కోటి'

శివ ముక్కోటి సందర్భంగా సోమవారం జిల్లాలోని శైవాలయాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరులోని మూలాపేటలో వున్న మూలస్థానేశ్వరాలయంలోనూ, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాల్లోనూ విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు, పూలంగిసేవలు, కుంభ హారతులు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# జొన్నవాడలో ఆరుద్రోత్సవం

ఆరుద్ర నక్షత్రం సందర్భంగా జొన్నవాడ ఆలయంలో ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీ తాండవేశ్వరస్వామికి, శివకామేశ్వరీదేవికి కన్నుల పండువగా విశేష అలంకారాలు చేశారు. అనంతరం, పంచామృతాలతో రుద్రపాద అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎంతో వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# రిజర్వు స్థలాన్ని కాపాడండి

**--- కమిషనర్‌ను కోరిన కోటంరెడ్డి ---**



నెల్లూరులోని ఇస్కాన్‌సిటి పరిధిలో సర్వేనెంబర్ 680, 681, 684లలో 10కోట్ల విలువచేసే రెండెకరాల రిజర్వ్‌స్థలం కబ్జాకు గురైందని, ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయాలని కోరుతూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం నెల్లూరు నగర పాలకసంస్థ కమిషనర్ చక్రధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణం సర్వే చేయించి ముందు ఈ స్థలాన్ని గుర్తించాలని ఆయన కోరారు. ఈ రిజర్వు స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను కూడా ఆయన కమిషనర్‌కు అందజేశారు. రెండువారాల క్రితం ఈ స్థలం గురించి కార్పొరేషన్ అధికారులకు చెప్పాను, ఇంతవరకు ఎవరూ స్పందించలేదు. కార్పొరేషన్‌లో రికార్డులు లేకుంటే నేనే సేకరించి ఇచ్చాను. అది రిజర్వుస్థలం కాదంటే నాకు వ్రాతపూర్వకంగా వ్రాసివ్వాలని ఆయన కమిషనర్‌ను అడిగారు. ఈ స్థలం కబ్జా వెనుక రాజకీయ అదృశ్యశక్తులున్నాయని ఆయన ఆరోపించారు. ఒక్క ఇస్కాన్‌లోనే కాదని, నగరంలో చాలాచోట్ల ఇలాంటి రిజర్వ్‌స్థలాలను కబ్జా చేసారని, అధికారులు సర్వేచేసి వాటన్నింటిని స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మేయర్ అజీజ్‌ను కూడా కలిసి ఆయన ఈ రిజర్వ్ స్థలంపై చర్చించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

# జడ్పీలో ఇసుక దుమారం

నెల్లూరుజిల్లాలో యధేచ్ఛగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై నెల్లూరుజిల్లా పరిషత్‌లో వాడివేడిగా చర్చలు సాగాయి. బుధవారం జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సహా జడ్పీటీసీ సభ్యులందరూ ముక్తకంఠంతో అన్ని పార్టీల వారి హస్తంతోనే ఇసుక అక్రమరవాణా జరుగుతోందని జిల్లా కలెక్టర్, ఎస్పీ కఠినంగా వ్యవహరిస్తే అక్రమార్కుల అంతు చూడవచ్చని, ఇసుక వ్యవహారంలో కలెక్టర్, ఎస్పీలదే బాధ్యత అని అన్నారు. అన్ని శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇసుక రేవుకు రెండువైపుల ఉన్న మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని చేసిన సూచనలతో సభ్యులంతా ఏకీభవించారు.

# మాస్టర్‌ప్లాన్ శిలాశాసనం కాదు



మాస్టర్ ప్లాన్ శిలా శాసనం కాదని, ప్రజల అవసరాల దృష్ట్యా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులు చేయొచ్చని మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నెల్లూరు మినీబైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో గత పాలకులు అవకతవకలకు పాల్పడ్డారంటూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు ప్రభుత్వం ఇష్టమని, ఏదన్నా మార్పులు చేయదలచుకుంటే తాను కూడా ముఖ్యమంత్రి వద్దకు రావడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నెల్లూరును శిథిలం చేసి వందలాది కుటుంబాలను వీధులపాల్జేసే మాస్టర్‌ప్లాన్‌లను నిలిపేసి పునఃనిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పిండి సురేష్, ఏసి సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, మునాఫ్, బర్నాబాసు, విజయలు పాల్గొన్నారు.



# తడలో దడదడ

## 'సిమి' ఉగ్రవాదుల సమాచారంతో ఆందోళన

*చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాల్లో బాంబుపేలుళ్లకు పాల్పడ్డ 'సిమి' ఉగ్రవాదులు తమిళనాడు – ఆంధ్రా సరిహద్దుల్లోని తడ ప్రాంతంలోకి రావచ్చుననే సమాచారంతో ఈ ప్రాంతంలో ఆందోళన నెలకొంది.*

చెన్నైలోని సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో బాంబు దాడికి దిగిన 5మంది సిమి ఉగ్రవాదుల కోసం తమిళనాడు పోలీసులు గాలిస్తున్నారు. కొన్ని నెలల క్రితం చిత్తూరుజిల్లా పుత్తూరులో కొందరు ఉగ్రవాదులు మకాం పెట్టి ఉండగా తమిళనాడు పోలీసులే రంగంలోకి దిగి వారిని పట్టుకున్నారు. దీంతో ఉగ్రవాదులు ఎక్కడైనా తలదాచుకునేందుకు ఆస్కారముంది. ఈ నేపథ్యంలోనే ఆరంబాకం పోలీసులు గాలింపు చేపడుతూ తడ పోలీసులకు 'సిమి' ఉగ్రవాదులకు చెందిన ఊహాచిత్రాలను అందించారు. ఇలాంటి పోలికలతో ఉండేవాళ్లు కనిపిస్తే అదుపులోకి తీసుకుని విచారించమని చెప్పారు. ఈ ఫోటోలను పట్టుకుని తడ పోలీసులు కూడా పరిసర ప్రాంతాల్లో గాలించారు. వైజాగ్‌కు చెందిన ఒక అనుమానితుడిని పట్టుకుని, అతను అలిగి ఇంటి నుండి వచ్చేసాడని తెలుసుకుని వదిలేసారు.

తడ, సూళ్లూరుపేట ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్నాయి. శ్రీహరికోట షార్ సెంటర్ ఇక్కడే వుంది. పులికాట్ సరస్సులో 20దాకా దీవులున్నాయి. వీటిలో ఎక్కడైనా ఉగ్రవాదులు తల దాచుకునే అవకాశముంది. ఇక శ్రీసిటి, అపాచీ సెజ్‌లున్నాయి. ఎన్నో విదేశీ కంపెనీలను ఇక్కడ ఏర్పాటు చేసి వున్నారు. విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు నిత్యం ఇక్కడకు రాకపోకలు సాగిస్తుంటారు. షార్ సెంటర్‌తో పాటు విదేశీపారిశ్రామికవేత్తల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో పోలీసు నిఘాను ముమ్మరం చేయాల్సివుంది.

# నారాయణలో న్యూరాలజీ జాతీయ సదస్సు



ఈ నెల 4వ తేదీన నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో న్యూరో రేడియాలజీ జాతీయ సదస్సు జరిగింది. నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వీరనాగిరెడ్డి, సిఇఓ డాక్టర్ సి.విజయమోహన్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ సింధులు జ్యోతిప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. నారాయణ కాలేజీ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.సంపత్‌కుమార్ మాట్లాడుతూ మహానగరాల్లో మాత్రమే జరిగే అవకాశమున్న ఇలాంటి జాతీయసదస్సుకు నారాయణ మెడికల్ కళాశాల వేదిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. నారాయణ హాస్పిటల్‌లో దేశంలో అరుదైన 3టెస్లా ఎంఆర్‌ఐ స్కాన్, 128 మల్టీస్లైస్ సిటి స్కాన్, 8ఛానల్ ఇఎన్‌ఎంజి, ఇఇజి వంటి అధునాతన వైద్యపరికరాలు, న్యూరాలజీ మరియు రేడియాలజీ విభాగంలో అందుబాటులో వుండడం, నిష్ణాతులైన వైద్యబృందం పనిచేయడం వల్లే ఈ సదస్సును నిర్వహించడానికి వీలు కలిగిందన్నారు.

ప్రపంచస్థాయి వైద్యనిపుణులు డాక్టర్ ఆషిస్ ఆత్రే మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే న్యూరాలజీ సమస్యల గురించి, వాటి వైద్య చికిత్సల గురించి, వెన్నెముక సంబంధించిన వ్యాధులను ఎలా గుర్తించాలనే దానిపై వివరించారు.

ఈ సదస్సులో డాక్టర్ రవివర్మ, డాక్టర్ శరత్, డాక్టర్ రూపశేషాద్రి, డాక్టర్ జితేంద్రసాయి, ఇంకా 151మంది న్యూరాలజిస్టులు, 28మంది రేడియాలజిస్టులు, వివిధ విభాగాలకు చెందిన 48మంది వైద్యనిపుణులు, 129మంది పిజి విద్యార్థులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com